
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 13 మే 2024



# ఢీ అంటే ఢీ

**వైసీపీ, టీడీపీ ఢీ అంటే ఢీ అంటున్నాయి. నవరత్నాలు తమను కాపాడతాయని, జగన్ చరిష్మాతో గెలుస్తామని.. వీటికి తోడు తాము పంచిన డబ్బులు తప్పక గెలిపిస్తాయని వైసీపీ అభ్యర్థులు నమ్మకంతో ఉన్నారు. అయితే.. ఐదేళ్లుగా జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో సాగిన అధికార పార్టీ నేతల భూదందాలు, చెలరేగిపోయిన ఇసుక మాఫియా.. జగన్ ఇచ్చిన మద్యపాన నిషేధం హామీ అమలు చేయకపోవడం.. ధరలు, కరెంటు, బస్సు చార్జీలు విపరీతంగా పెంచడం తమకు కలిసొస్తాయని టీడీపీ అభ్యర్థులు భావిస్తున్నారు. ఇక కడప ఎంపీగా బరిలో దిగిన షర్మిల.. తన అన్న జగన్‌పై ఎక్కుపెట్టిన పదునైన ప్రశ్నలు, ఆడబిడ్డగా కొంగుచాచి ఓట్లు అడగటం జిల్లా ప్రజలను ఆలోచనలో పడేశాయి. అయితే.. ఎవరు గెలుస్తారో ఎవరు ఓడుతారో తేల్చే ఓటర్లు మాత్రం గుంభనంగా ఉన్నారు. నేడు తమ ఓటుతో తీర్పు ఇవ్వబోతున్నారు.**



- గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- మద్యపాన నిషేధం హామీకి జగన్ తూట్లు
- వైసీపీ నేతల భూకబ్జాలు, దాడులు కలిసొస్తాయని టీడీపీ నమ్మకం
- వివేకా హంతకులను వెనకేసుకొస్తున్నాడంటూ షర్మిల, సునీతల ప్రచారం
- టీడీపీ మేనిఫెస్టోతో టీడీపీకి బూస్ట్
- నవరత్నాలు ఆదుకుంటాయని వైసీపీ నమ్మకం
- జగన్ చరిష్మాపైన ఆశలు పెట్టుకున్న వైసీపీ అభ్యర్థులు



(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సొంత జిల్లాలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలపై టీడీపీ గెలుపుపై చాలా ధీమాతో ఉంది. ఈసారి కడప జిల్లాలో టీడీపీ పాత ట్రాక్ రికార్డును తీసుకువస్తామని బలంగా విశ్వసిస్తోంది. 2014 ఉమ్మడి జిల్లాలో 9 స్థానాలు, రెండు పార్లమెంట్లను వైసీపీ దక్కించుకుంది. కేవలం రాజంపేట సీటుతోనే టీడీపీ సరిపెట్టుకుంది. 2019లో ఎన్నికల్లో పది అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను స్వీప్ చేసి వైసీపీ సత్తా చాటింది. అయితే సీఎం జగన్‌పై సొంత జిల్లావాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అభివృద్ధి అటుంచితే పాలన అంతా భూకబ్జాలు, మట్టిమాఫియా, ఇసుక దందా ఇతరత్రా వాటితో జనం విసిగిపోయారు. ఇక ప్రభుత్వంపై ఉద్యోగులు, అంగన్వాడీలు ఇతర ద్యోగుల్లో వ్యతిరేకత ఉంది. దీంతో పాటు జగన్ సోదరి వైఎస్ షర్మిల కడప పార్లమెంటు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇవన్నీ వైసీపీని దెబ్బకొడతాయని అంటున్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే..

### కడపలో..

అంజద్‌బాషా కడప ఎమ్మెల్యేగా పదేళ్లుగా ఉన్నారు. ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్నారు. కడపలో అభివృద్ధి జరిగింది గోరంత అయితే కబ్జాలు, అరాచకాలు కొండంత. జిల్లా హెడ్‌క్వార్టరు అయిన కడపలో నాలుగు కూడళ్ల మాత్రం అభివృద్ధి చేసి మమ అనిపించారు. ఆర్కేనగర్, భగత్‌సింగ్‌నగర్, ఇతర శివారు ప్రాంతాలు ఇప్పటికీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. ఇక కడపలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఉన్నాయి. వారానికి రెండు రోజులు మాత్రమే నీరు వచ్చే పరిస్థితి వచ్చింది. కడప నగరమంతా భూకబ్జాలమయంగా మారిపోయింది. ఇవన్నీ డిప్యూటీ సీఎంకు వ్యతిరేకంగా ఉన్నాయి. దీనికి తోడు అంజద్‌బాషా కేవలం తన సామాజిక వర్గానికే ప్రాధాన్యత ఇస్తారన్న ప్రచారం ఉంది. ఇక టీడీపీ నుంచి ఆర్.మాధవీరెడ్డి పోటీ చేస్తున్నారు. 8 నెలల కాలంలో కడపను చుట్టేశారు. జనం సమస్యలను తెలుసుకున్నారు. తనను గెలిపిస్తే కడపను అభివృద్ధి చేస్తానని చెప్పారు. మాధవీరెడ్డి ఓటర్లతో బాగా మమేకమయ్యారు. దీంతో కడప జనం మూడ్ మారిందని ప్రచారం సాగుతోంది. ఈసారి టీడీపీకి ఓటు వేయాలని జనం డిసైడ్ అయినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే గెలిచేది తామే అని డిప్యూటీ సీఎం వర్గీయులు అంటున్నారు.

### ప్రొద్దుటూరులో..

ప్రొద్దుటూరులో టీడీపీ నుంచి వరదరాజులరెడ్డి, వైసీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. వదరారజులరెడ్డి ఐదుమార్లు ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆయన పాలనలో ప్రశాంతంగా ఉండేవారంటారు. అందుకే ప్రతిసారి ఆయనకు పట్టం కట్టారని చెబుతారు. అయితే జగన్ సీఎం అయిన తరువాత ఎమ్మెల్యే రాచమల్లు ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో అరాచకం రాజ్యమేలింది. బీసీ నేత నందం వెంకటసుబ్బయ్య హత్యతో సహా పలు అరాచకాలు జరిగాయి. భూకబ్జాలు పెరిగాయి. ఇవన్నీ వైసీపీకి మైనస్‌గా మారాయంటారు. అయితే తాను పంచిన తాయిలాలు తనను గెలిపిస్తాయనే ధీమాలో రాచమల్లు ఉన్నారంటారు.

### బద్వేలులో..

బద్వేలు ఒకప్పుడు టీడీపీ జమానా. అయితే జగన్ సీఎం అయిన తరువాత ఇక్కడ కబ్జాలమయంగా మారింది. బద్వేలు, పోరుమామిళ్ల, కాశినాయన కలసపాడులో వైసీపీ నేతలు ఏరియాను పంచుకుని కబ్జాలు చేశారు. దీంతో స్థలాలు భూములు ఉన్న వారు భయంగా ఉన్నారు. వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే దాసరి సుధ పోటీ చేస్తుండగా ఎన్‌డీఏ కూటమి నుంచి బీజేపీ అభ్యర్థిగా రోశన్న పోటీ చేస్తున్నారు. వైసీపీ అరాచకాలు గెలిపిస్తాయని టీడీపీ భావిస్తోంది. నవరత్నాలతో లబ్ధి పొందిన వారు తమను గెలిపిస్తారని వైసీపీ భావిస్తోంది.

### మైదుకూరులో..

మైదుకూరు టీడీపీ నుంచి పుట్టా సుధాకర్ యాదవ్, వైసీపీ నుంచి రఘురామిరెడ్డి పోటీ చేస్తున్నారు. వీరిద్దరూ పాత కాపులే. ఇప్పటిదాకా వీరిద్దరి మధ్య జరిగిన పోటీలో రఘురామిరెడ్డినే గెలిచారు. అయితే ఈసారి పరిస్థితులు అనూహ్యంగా మారిపోయాయంటారు. 2014-19లో టీడీపీ హయాంలో పుట్టా సుధాకర్‌యాదవ్ సుమారు వెయ్యి కోట్లకు పైగా మైదుకూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశారు. రఘురామిరెడ్డి ఈ ఐదేళ్లలో భూములు కబ్జా చేశారని, అభివృద్ధి పనుల్లో పర్సంటేజీలు తీసుకున్నారనే ఆరోపణలు వైసీపీకి మైనస్‌గా మారాయి. దీంతో పాటు పుట్టా సుధాకర్‌యాదవ్ వరుసగా ఓటమి చె ందడం, గతంలో ఎన్నడు లేని విధంగా టీడీపీలోకి వలసలు వచ్చారు. ఇక టీడీపీ మేనిఫెస్టో జనాల్లోకి బాగా వెళ్లింది. అయితే ఇదే తనకు చివరి ఎన్నికలు కాబట్టి తనను గెలిపిస్తారనే ధీమా వైసీపీ అభ్యర్థిలో ఉంది. టీటీడీ చైర్మన్‌గా తాను వేయికోట్ల అభివృద్ధి తనను గెలిపిస్తుందని టీడీపీ అభ్యర్థి బలంగా నమ్ముతున్నారు.

### కమలాపురంలో..

కమలాపురం నుంచి పుత్తా చైతన్యరెడ్డి పోటీ చేస్తుండగా వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డి మూడోసారి బరిలో దిగారు. అయితే ఈ సారి పుత్తా చైతన్యరెడ్డిదే గెలుపు అని జనాల్లో టాక్ ఉంది. రవీంద్రనాధరెడ్డి ఆయన హయాంలో ఎక్కువగా భూకబ్జాలు. గ్రావెల్, మట్టి దందా జరిగిందంటారు. వైసీపీ నుంచి పెద్దఎత్తున టీడీపీలోకి వలసలు వచ్చాయి. పుత్తా చైతన్యరెడ్డికి బ్రహ్మరథం పట్టారు. పుత్తా కుటుంబం నాలుగుసార్లు ఓటమి చెందారు ఈసారి అవకాశం ఇద్దామని ఓటర్లు డిసైడ్ అయ్యారని అంటున్నారు. ఓటరు నాడిని పసిగట్టి వైసీపీ నేతలు కొందరు ఇప్పుడు సైలెంట్‌గా ఉన్నారు. కమలాపురంలో ఎవరూ ఇప్పటి వరకు మూడోసారి వరుసగా గెలవలేదు.

### జమ్మలమడుగులో..

జమ్మలమడుగులో ఎన్‌డీఏ కూటమి నుంచి బీజేపీ అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డి పోటీ చేస్తున్నారు. ఇయన టీడీపీలో మాజీమంత్రిగా పనిచేశారు. వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మరోసారి పోటీ చేస్తున్నారు. అయితే సుధీర్‌రెడ్డిపై జనాల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నట్లు చెబుతారు. సొంత కేడరే సుధీర్‌ను వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. జమ్మలమడుగుపై జగన్ ప్రభావం, నవరత్నాలు గెలిపిస్తాయని సుధీర్‌రెడ్డి వర్గం భావిస్తోంది. ఆదినారాయణరెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో రైతులు, మహిళలు ఇతరుల సంక్షేమం కోసం పాటు పడ్డారు. అయితే ఇప్పుడు జగన్‌పాలనలో సంక్షేమ పథకాలు తప్ప ప్రత్యేకంగా చేసిందేమీ లేదు. స్టీలుప్లాంటుకు రెండుసార్లు శంకుస్థాపనలు తప్ప ఏమీ కాలేదు. జగన్ పాదయాత్ర సమయంలో ఆర్టీపీపీ కార్మికులను రెగ్యులర్ చేస్తామన్నారు. కానీ చేయలేదు. ఇవన్నీ వైసీపీకి మైనస్‌గా మారాయి. బీజేపీని గెలిపిస్తే స్టీలు ప్లాంటు ముందుకు తీసుకెళతానంటూ ఆదినారాయణరెడ్డి చెప్పుకొస్తున్నారు.

### పులివెందులలో..

పులివెందుల అసెంబ్లీకి వైసీపీ నుంచి సీఎం జగన్, టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాధరెడ్డి (బీటెక్ రవి), కాంగ్రెస్ నుంచి ధ్రువకుమార్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. పులివెందుల జనం ఎప్పటినుంచో వైఎస్ కుటుంబాన్ని ఆదరిస్తున్నారు. అయితే వివేకా హత్యతో వైఎస్ ఇంటిగుట్టు బట్టబయలైంది. వైఎస్ వివేకాహత్యలో అవినాశ్‌రెడ్డిని సీబీఐ నిందితుడిగా చేర్చింది. ఇక వివేకా హత్య, ఆస్తి తగాదాల్లో జగన్‌ను ఆయన చెల్లి షర్మిల, వివేకా కూతురు సునీత వ్యతిరేకిస్తున్నారు. దీంతో వైఎస్ కుటుంబం నిలువునా చీలిపోయింది. కడప పార్లమెంటు నుంచి షర్మిల పోటీ చేస్తున్నారు. షర్మిలా గెలుపు కోసం పులివెందులలో షర్మిల, సునీత ప్రచారం చేశారు. జగన్ కోసం ఆయన సతీమణి భారతి పులి పర్యటించారు. వివేకా హత్య విషయాన్ని షర్మిల, సునీత జనాల్లోకి బలంగా తీసుకెళ్లారు. ఇది ఎక్కడ కొంప ముంచుతుందోనని వైసీపీలో టెన్షన్ ఉంది. ఇక టీడీపీ నుంచి రెండోసారి మాజీ ఎమ్మెల్సీ బీటెక్‌రవి పోటీ చేస్తున్నారు. టీడీపీ హయాంలో కరువుబారిన పడ్డ పులివెందులకు సాగునీరు ఇచ్చారు. ఎండిపోతున్న చీనీ చెట్లను కాపాడింది చంద్రబాబే. ఆ కృతజ్ఞత రైతుల్లో ఉంది. ఇక్కడ టీడీపీకి గత ఎన్నికల్లో సుమారు 50వేల ఓట్లు వచ్చాయి.. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సరే బీటెక్ రవి అండ్ కో జగన్ గ్యాంగ్‌ను ధైర్యంగా ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ టీడీపీకి ప్లస్‌గా మారుతున్నాయి.



### కడప ఎంపీ స్థానంలో..

సీఎం జగన్ సోదరి షర్మిల పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టాక తొలుత జగన్ అండ్ కో లైట్ తీసుకుంది. అయితే ఆమె కడప పార్లమెంటుకు పోటీ చేసి జిల్లాలో పర్యటించడం, ప్రచారం చేసిన తరువాత వైసీపీలో వణుకు పుడుతోంది. వివేకాను చంపిన హంతకులను సీఎం జగన్ కాపాడుతున్నారంటూ ఆమె జనాల్లోకి బాగా తీసుకెళ్లారు. కడప జనం న్యాయం వైపు ఉంటారా లేదా అని, కొంగు చాపి అడుగుతున్నా అన్న మాటలు జనాల్లోకి వెళ్లాయి. ఇది వైసీపీ ఓట్లకు గండి పడుతుందని ప్రచారం సాగుతోంది. షర్మిలకు క్రాస్‌ఓటింగ్ జరుగుతుందన్న భయం వైసీపీలో ఉంది. వైసీపీ నుంచి పోటీ చేస్తున్న అవినాశ్‌రెడ్డి కొందరినే చేరదీశారనే అపవాదు క్యాడర్‌లో ఉంది. ఇక తెలుగుదేశం పార్టీ నుంచి బరిలో దిగిన భూపేశ్‌రెడ్డి మొదటిసారి ఎంపీగా తలపడుతున్నారు. గత పర్యాయం ఎన్నికల్లో టీడీపీకి సుమారు 4 లక్షలు ఓట్లు వచ్చాయి. దీంతో కడప ఎంపీ స్థానానికి ముక్కోణపు పోటీ నెలకొంది.


---

# ఇదేంది.. జగనా..

- మద్యనిషేధం చేసి ఓట్లు అడుగుతానంటివి..
- మా ఓట్లన్నీ కొల్లగొడితివి..
- పిచ్చి పిచ్చి బ్రాండ్లు తెచ్చి మా పుస్తెలు తెంచితివి..
- మాట ఇచ్చి మడమ తిప్పను.. అంటే ఇదేనా..
- మళ్లీ నిన్ను నమ్మి ఓట్లెలా వేస్తాం..
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు

> మద్యంపై ఆదాయం అంటే ప్రజల రక్త మాంసాలతో వ్యాపారం చేయడమే.. మహిళల కంట కన్నీరు పెట్టించే ఆదాయంతో ఎవరికీ మేలు జరగదు... సమాజానికి నష్టం... కాపురాల్లో మద్యం చిచ్చుపెడుతుంది... మానవ సంబంధాలు ధ్వంసమవుతున్నాయి... నేను అధికారంలోకి రాగానే మూడు విడతల్లో మద్యపాన నిషేధం చేస్తా..
>
> ఇవాళ గ్రామాలకు వెళితే.. మినరల్ వాటర్ లేని ఊరు ఉంటుందేమో కానీ ప్రతి గ్రామంలో మందుబాటిళ్లు దొరుకుతున్నాయి.. ఇవాళ ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రతి అక్క చెల్లెమ్మలకు మాట ఇస్తున్నా.. మద్యపాన నిషేధం చేసి 2024లో ఓట్లు అడుగుతా... అంటూ 2019 ఎన్నికల ప్రచారంలో జగన్ హామీ ఇచ్చి మహిళల ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టాడు.
>
> ఎన్నికల మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతతో సమానమంటూ 2019 ఎన్నికల్లో చెప్పుకొచ్చారు. మాట ఇస్తే.. మడమ తిప్పను అంటూ చెప్పారు.. అయితే గద్దెనెక్కాక ఇచ్చిన మాటకు జగన్ మడత పెట్టేశాడు. కాలచక్రం గిర్రున తిరిగి ఐదేళ్లు గడి చాయి.. 2024 ఎన్నికలు వచ్చాయి.. మద్యపాన నిషేధం చేయకుండానే ఇప్పుడు ఎన్నికలకు వెళ్లడాన్ని చూసి.. మాట ఇచ్చి మడమ తిప్పుతావా జగన్ అని మహిళలు ప్రశ్నిస్తున్నారు.






(కడప - ఆంధ్రజ్యోతి): 2019 ఎన్నికలకు ముందు మద్యం రక్కసి వల్ల మహిళల పుస్తెలు తెగుతున్నాయంటూ అప్పట్లో వైసీపీ నేతలు నంగనాచి మాటలు చెప్పారు. అధికారంలోకి వస్తే దశలవారీగా మద్యనిషేధం చేస్తామంటూ జగనే హామీ ఇచ్చాడు. అయితే గద్దెనెక్కాక హామీ మరిచాడు. కొన్ని లిక్కర్ షాపులు తగ్గించాడు. తరువాత రేట్లు పెంచాడు. దశల వారీగా మద్యనిషేధం అంటూ కటింగ్ ఇచ్చాడు. మద్యానికి బానిసలుగా మారిన వారి కోసం డీఅడిక్ట్ కేంద్రాలను ఏర్పాటు చేసి మద్యం అలవాటు మాన్పించే విధంగా చికిత్సలు అందిస్తానని హామీ ఇచ్చారు. అయితే నవరత్నాలు అంటూ జనానికి అరకొర విదిల్చి మద్యం పేరుతో అంతకు పదింతలు లాగేశారు.

### ఎప్పుడు వినని.. జేబ్రాండ్లు వచ్చాయి

ఉమ్మడి రాష్ట్రంలో కానీ విభజిత రాష్ట్రంలో కానీ దేశంలో లభ్యమయ్యే మద్యం బ్రాండ్లు ఇక్కడే దొరికేవి. అయితే జగన్ సీఎం అయిన తరువాత 2019 అక్టోబరు నుంచి ప్రైవేటు మద్యం షాపుల ప్లేసులో ప్రభుత్వమే మద్యం అమ్మకాలు చేపట్టింది. ఆ తరువాత నుంచి మద్యం దుకాణాల్లో ఎప్పుడు వినని పేర్లతో బ్రాండ్లు వెలిశాయి. భూం భూం, బ్లాక్‌బస్టర్, ఇక చీప్ లిక్కర్ అయితే దారూ హౌస్ తదితర పేర్లతో మద్యం బ్రాండ్లు వచ్చాయి. ఇలాంటి పిచ్చి పిచ్చి పేర్లు ఉంటాయని కూడా ఊహించి ఉండరు. ఇక జగన్ మందు తాగిన వారికి లివర్ పాడవడంతో పాటు మతిమరుపు వస్తుందంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. మద్యం బ్రాండ్లపై తీవ్ర దుమారం రేగినా జగన్ ప్రభుత్వం తగ్గేది లేదంటూ అవే బ్రాండ్లు అమ్ముతూ వచ్చింది. ఇవన్నీ జే బ్రాండ్లు అంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారం, సభలకు వచ్చిన వారికి డబ్బు లు, మద్యం బాటిళ్లు తీసుకువచ్చారు. అయితే ఎన్నికల ప్రచారంలో కూడా ఈ జే బ్రాండ్లేనా, పాత బ్రాండ్లు లేవా అంటూ కొందరు మందుబాబులు నిలదీశారు. ఇక ముఖ్యమైన కార్యకర్తలకు వైసీసీవారు బార్లు, ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన మందును సరఫరా చేశారు.

### రూ.4వేల కోట్ల మద్యం అమ్మకాలు

జగన్ తాను పేదల పెన్నిది అంటూ చెప్పుకుంటాడు., ఈ ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు పోటీ అని చెప్పుకొస్తాడు. తాను మీ కోసం 130 సార్లు బటన్ నొక్కాను. బటన్ నొక్కుడు ద్వారా నేరుగా మీ అకౌంటులో వేస్తున్నామని చెప్పడానికి ఎంతో గర్విస్తున్నానని చెప్పుకొస్తాడు. కానీ ఒక చేత్తో పది ఇచ్చి మరో చేత్తో వంద లాక్కుంటున్న విషయం జనాలకు బాగా ఆలస్యంగా అర్థమైంది. నవరత్నాల పేరిట ఇచ్చింది కొంతైతే కేవలం మద్యం ద్వారానే జిల్లాలో 4వేల కోట్లకు పైగా డబ్బు లాగేశారు. నాలుగేళ్ల మద్యం అమ్మకాలు పరిశీలిస్తే.. రూ.3009.98 కోట్లు మద్యం అమ్మకాలు జరిగాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.607,80,38,844, 2021-22లో రూ.722,32,21,696, 2022-23లో రూ.814,57,54, 992, 2023-24లో ఈనెల మార్చి 30 నాటికి రూ.865,28,75,618 మొత్తం కలుపుకుంటే రూ.3009,98,91,150 అమ్మకాలు సాగాయి. జగన్ ప్రభుత్వం 2019 నుంచి 2020 మార్చి ఆర్థిక సంవత్సరాన్ని కూడా కలుపుకుంటే ఎంత వేసుకున్నా కూడా వెయ్యి కోట్లు పైమాటే ఉంటుంది. అమ్మకాల సంఖ్య 4వేల కోట్లుకు పైగా జరిగింది. ఇదే జగనన్న మార్కు మద్యనిషేధం అంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.

### నో డిజిటల్ పేమెంటు ఓన్లీ క్యాష్

కరోనా తరువాత నగదు రహిత లావాదేవీలు పెరిగాయి. ఫోన్‌పే, గూగుల్‌పే, ఏటీయం, అమేజాన్ పే లాంటి రకరకాల పేమెంటు యాప్‌లు వచ్చాయి. మారుమూల పల్లెల్లో కూడా ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీయం ద్వారా సిగరెట్ వరకు లావాదేవీలు ఉన్నాయి. కానీ మద్యం షాపుల్లో మాత్రం ఓన్లీ క్యాష్ మాత్రమే. నో క్యాష్‌లెస్. రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు రావడంతో గత ఏడాది మూన్నాళ్ల ముచ్చటగా కొద్దిరోజులు డిజిటల్ లావాదేవీలు నిర్వహించి మళ్లీ షరా మామూలుగా క్యాష్‌తోనే మందు అమ్ముతున్నారు. అయితే ఇటీవల ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత వారం పదిరోజుల నుంచి డిజిటల్ పేమెంట్లకు అనుమతిచ్చారు.

### ఎక్కడ చూసినా మద్యమే

జగన్ ప్రభుత్వం అమ్మే మద్యం బాగాలేక మందుబాబులు పొరుగురాష్ట్రాల మద్యంపై దృష్టి పెట్టారు. దీంతో తెలంగాణ, కర్ణాటక, గోవా, మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల మద్యం పుష్కలంగా దొరుకుతుంది. అప్పట్లో జగన్ చెప్పినట్లుగా మినరల్ వాటర్ లేని గ్రామం ఉందేమో కానీ మందుబాటల్ లేని ఊరే లేదంటూ జగన్ చెప్పేవారు. నిజమే ఇప్పుడు కూడా జిల్లాలో మినరల్ వాటర్ దొరకని ఊరు ఉందేమో కానీ మందుబాటిల్ దొరకని ఊరు లేదంటారు.

### మాట తప్పావా... జగన్

ప్రతి అక్కకు చెల్లెమ్మకు చెబుతున్నా. మాట ఇస్తున్నా మద్యపానం నిషేధం చేసి 2024లో ఓట్లు అడుగుతానని హామీ ఇస్తున్నా అని 2019 ఎన్నికల్లో జగన్ చెప్పుకొచ్చారు. జగన్ సీఎం అయితే మద్యనిషేధం అమలు అవుతుందని మహిళలంతా సంతోషించారు. కష్టపడే సొమ్ముతో పొదుపు చేసుకుని బిడ్డల చదువులు, సొంత ఇల్లు కట్టుకుంటే కుటుంబాలు బాగుపడతాయని మహిళలు సంతోషించారు. దశలవారీగా మద్యనిషేధం అంటూ రేట్లు పెంచేసి మందుబాబులకు అదనపు భారం మోపారు. జగన్ మాట తప్పడంతో పాటు వచ్చే ప్రభుత్వాలు కూడా మద్యనిషేధం చేసే విధంగా మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. ఇదేనా జగనన్నా మద్యనిషేధం అని చెప్పి మాట తప్పి ఎన్నికలకు రావడం పట్ల మహిళలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

---

ఎన్నికల నిర్వహణలో భాగంగా కడప ఆర్ట్స్ కళాశాలలో ఎన్నికల సన్నాహాలలో బిజీగా ఉన్న పోలింగ్ సిబ్బంది



# నేడే పోలింగ్

- సర్వం సిద్ధం
- అన్ని నియోజక వర్గాల్లో ఏర్పాట్లు పూర్తి
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



(కడప - ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో చివరి అంకమైన పోలింగ్ సోమవారం జరగనుంది. ఎన్నికల్లో గెలుపు కోసం టీడీపీ వైసీపీలు ఎన్నికల షెడ్యూలు ముందు నుంచి అంటే దాదాపు ఆరు నెలలుగా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తిరుగుతున్నారు. టీడీపీ భవిష్యత్తు గ్యారంటీ పేరుతో ఇంటింటికీ వెళ్లగా.. వైసీపీ ప్రభుత్వ కార్యక్రమాలతో ఇంటింటికీ వెళ్లారు. ఎన్నికల షెడ్యులు వచ్చిన తరువాత విస్తృతంగా ప్రచారం చేశారు. టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీజేపీ, ఎన్‌డీఏ కూటమి కమ్యూనిస్టుల అభ్యర్థుల గెలుపు కోసం అగ్రనేతలే జిల్లాకు వచ్చారు. టీడీపీ గెలుపు కోసం చంద్రబాబు ప్రజాగళం పేరిట ప్రొద్దుటూరు, కడప సభలో పాల్గొనగా నిజం గెలవాలి పేరుతో చంద్రబాబు సతీమణి కడప, ప్రొద్దుటూరు, బద్వేలులో పర్యటించారు. ఇకవైసీపీ గెలుపు కోసం జగన్ ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరులో ప్రచారం చేశారు. కాంగ్రెస్ కోసం షర్మిల జిల్లాలో రెండుసార్లు పర్యటించింది. ఇక చివరగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కాంగ్రెస్ ప్రముఖులు షర్మిలకు మద్దతుగా నిలిచి కడపలో భారీ బహిరంగసభలో ప్రసంగించారు. కమ్యూనిస్టు నేతలు నారాయణ, రామక్రిష్ణ, శ్రీనివాసులు కడపలో ప్రచారం చేశారు. ఇక ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి, బీజేపీ జమ్మలమడుగు అసెంబ్లీ అభ్యర్థి ఆదినారాయరెడ్డి కోసం కేంద్ర రక్షణశాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జిల్లాకు వచ్చారు.

### ఎన్నికలకు సర్వం సిద్ధం

సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులను ఎవరిని ఎన్నుకోవాలో నేడు ఓటర్లు తమ తీర్పు ఇవ్వనున్నారు. జిల్లాలో ఉదయం 7 నుంచి పోలింగ్ జరగనుంది. జిల్లాలో మొత్తం ఓట్లు 16,39,066 మంది ఉన్నారు. ఓటర్ల కోసం 2035 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఏడు అసెంబ్లీ స్థానాలకు 110 మంది పోటీ చేస్తుండగా పార్లమెంటులో 14 మంది బరిలో ఉన్నారు. ఇక ఎన్నికల విధుల్లో 14640 మంది పాల్గొన్నారు. జిల్లాలో 521 పోలింగ్ కేంద్రాలను క్రిటికల్‌గా గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టారు. 614 మంది మైక్రో అబ్జర్వర్లు, 2334 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 2336 మంది ఏపీవోలు, 963 మంది ఇతర సిబ్బంది పాల్గొననున్నారు. ఇక సమస్యాత్మకంగా గుర్తించిన 1223 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తారు. 741 కేంద్రాల్లో వీడియోగ్రఫీ చేయనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించిన పూర్తి సామగ్రి ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 7 నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది.

### ఓటును సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

కడప(కలెక్టరేట్), మే 12: ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటు హక్కు పొందిన వారంతా తమతమ నియోజకవర్గాలలో ఓటు కలిగిన పోలింగ్ కేంద్రంలో 13వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల లోగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆమోదించిన 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేయాలన్నారు. గతంలో కంటే ఈ సారి ఎన్నికల్లో అధికంగా ఓటింగ్ శాతం నమోదు కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

● ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రారంభం



కమలాపురం: ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్వో గణేశ్‌కుమార్



ఎన్నికల సామగ్రితో బయలుదేరుతున్న సిబ్బంది



ఎన్నికల విధులకు హాజరైన పోలీసు సిబ్బంది

కమలాపురం రూరల్, మే 12: నాలుగో విడత సాధారణ ఎన్నికల్లో భాగంగా కమలాపురం పట్టణంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో భద్రపరచిన ఎన్నికల సామగ్రిని ఆదివారం ఆర్వో గణేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. నియోజకవర్గంలో పురుషులు 990851, స్త్రీలు 1,04,284 కలిపి 2,04169 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 251 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో సమస్యాత్మకమైనవి 58గా గుర్తించారు. ఈ పోలింగ్ కేంద్రాలకు నియమించిన సిబ్బంది వారికి అప్పజెప్పిన ఎన్నికల సామగ్రి, ఈవీఎం తీసుకుని వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లకు బయల్దేరారు. ఒక్కో బూత్‌కు ఒక బీఎల్‌ఓను నియమించారు. ఆ బూత్‌కు సంబంధించి అన్నీ వీరే పర్యవేక్షించాలి. ఒక్కో బూత్‌లో పీఓ, ఏపీఓ, ఓపీఓ, పోలీస్, లేబర్ కలిసి దాదాపు 12 నుంచి 15 మంది అవసరం. ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున ప్రత్యేకంగా అధికారులు ప్రతి బూత్‌కు ఎలక్షన్‌కు రెండు రోజుల ముందు షామియానాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ విధుల్లో ఉండే సిబ్బంది నేటి సాయంత్రం తమకు కేటాయించిన ప్రాంతాలకు ఈవీఎంలతో వెళ్లాలని, పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు మాక్‌పోల్ నిర్వహిస్తామని ఆర్వో గణేశ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పోలింగ్ ఏజెంట్లకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల విధులకు ఎంపికైన అధికారులు ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రానికి సరైన సమయానికి రాకపోవడంతో ఆయన కొంత అసహనానికి గురయ్యారు. ఎన్నికల కేంద్రానికి వచ్చి, పేరు నమోదు చేసుకుని సామగ్రి తీసుకుపోవడానికి రాని అధికారులపై కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

**మద్యంప్రియులకు కష్టాలు**

ఎన్నికల నిబంధనల ప్రకారం శనివారం సాయంత్రం అధికారులు మద్యం షాపులను మూసివేయించి వాటిని సీల్ వేశారు. మే 13న ఏపీ ఎన్నికలకు పోలింగ్ జరుగుతున్నందున పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులు మూసివేయాలని ప్రభుత్వ నిబంధనలు ఉండటంతో కమలాపురం నియోజకవర్గంలో గల అన్ని మద్యం షాపులను అధికారులు మూసివేయించా రు. మద్యం షాపులను సీల్ వేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ సందర్భంగా మద్యంషాపులు నిర్వహిస్తే సీజ్ చేస్తామని అధికారులు తెలిపారు. మద్యంషాపులు బంద్ కావడంతో మద్యంప్రియులు ఇబ్బందులు పడుతున్నారు. బ్లాక్‌లో మద్యం కొనాలంటే 150 గల మద్యం బాటల్ 300 నుంచి 400 వరకు అమ్ముతున్నట్లు మద్యంప్రియులు పేర్కొంటున్నారు.

**గట్టి బందోబస్తు ఏర్పాటు చేశాం: ఏఎస్పీ**

సాధారణ ఎన్నికల సందర్భంగా కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అన్ని పోలింగ్ బూత్‌లలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఏఎస్పీ లోసారి సుధాకర్ తెలిపారు. సోమవారం నిర్వహించనున్న ఎన్నికల పోలింగ్ సందర్భంగా పోలీసులకు స్థానిక గురుకుల పాఠశాలలో బందోబస్తు విధులను అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అన్ని పోలింగ్ స్టేషన్లలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తు.చ తప్పకుండా పాటించాలన్నారు. అలా పాటించకపోతే పోలీసు దెబ్బ రుచి చూడాల్సి వస్తుందన్నారు. ఎక్కడా ఘర్షణ వాతావరణం ఏర్పడకూడదన్నారు. సాయుధ బలగాలు రూట్ మొబైల్స్ ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టామని, అల్లర్లు సృష్టించినా, ఈవీఎంలను తగిలినా గట్టి చర్యలు ఉంటాయని అన్నారు. గ్రామ బహిష్కరణ కూడా ఉంటుందని హెచ్చరించారు. నియోజకవర్గంలో 400 మంది సివిల్ పోలీసులు, 300 కేంద్ర బలగాలు, 100 మంది తమిళనాడు పోలీసులు, 1 ఏఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 15 ఎస్‌ఐలు అలాగే వీరితో పాటు 200 మంది ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విధుల్లో పాల్గొంటారు.

## పంపకాలు.. ప్రచారాలు పూర్తి

● నేడు ఓటు వినియోగించుకోనున్న 30,807 మంది

చెన్నూరు, మే 12 : మండలంలో ఎన్నికల హోరు ఆగింది. ప్రచారాలతో హోరెత్తిన మండలం శని, ఆదివారాల పంపిణీతో ఆగిపోయిది. సోమవారం మండల వ్యాప్తంగా 36 పోలింగ్ కేంద్రాల్లో 30,807 మంది ఓటర్లు తమ పార్టీ అబ్యర్థులకు ఓటు వేయనున్నారు. ఇందులో పురుష ఓటర్లు 14798, 16001మంది స్త్రీ ఓటర్లు, అలాగే 8 మంది ట్రాన్స్ జెండర్లు ఓటు వినియోగించుకున్నారు. 36 పోలింగ్‌కేంద్రాల్లో చెన్నూరులోని 71వ పో లింగ్ కేందంలో అత్యధికగా1301 మంది ఓటర్లు, అత్యల్పంగా 67వ బూత్‌లో 459 మంది ఓటు వేయనున్నారు. అలాగే మండల వ్యాప్తంగా పోలింగ్‌కేంద్రాల వద్ద నిఘా పర్యవేక్షణ కోసం సుమారు 80 మంది పోలీసు సిబ్బంది సవ్యంగా జరిగేందుకు రక్షణ బాధ్యతలు చేపడుతున్నారు. గతంలో జరిగిన ఎన్నికల కన్నా ఈ మారు ఎన్నికలు అటు టీడీపీ, ఇటు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ మరో వైపు కాంగ్రెస్‌పార్టీకి ప్రతిష్ఠాత్మకంగా ఉండడంతో ఎన్నికలువిషయంలో అధికార యంత్రాంగంగట్టి చర్యలు తీసుకుంటుంది. సోమవారం ఉదయం 7 నుండి సాయంత్రం 6 వరకు ఓటర్లు స్వేచ్ఛ గా ఓటు వినియోగించుకునేందకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా వీలైనంత ఉదయమే పోల్లింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలంటూ ఆయా పార్టీల వ్యక్తులు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి చెప్పడం జరిగింది. అలాగే దూరంగా ఉన్న వారి కోసం ఆటోలను ఆయా పార్టీల వారే ఓటర్ల అభ్యర్థన మేరకు ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. పైగా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా పర్యవేక్షణ ఉండడంతో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేలా గత నెల రోజులుగా చెన్నూరు పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా కవాతు నిర్వహించి ప్రజలకు అటు ఓటుపై అవగాహన, ఇటు స్వేచ్ఛగా ఓటు వేసుకునేందుకు అవకాశాన్ని కల్పించారు. ఇందుకోసం పగలు కవాతు, రాత్రి పల్లెనిద్ర వలే కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యవంతం చేయడం జరిగింది. మొత్తమ్మీద మండలంలో జరిగే ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు సహకరించాలన్నారు. అన్నిరకాల చర్యలు చేపట్టి ఎస్పీ, డీఎస్పీల సారథ్యంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెన్నూరు సీఐ పార్థసారథి తెలిపారు.

**ఓటర్లలో నయాజోష్**

టీడీపీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి మంచి వాక్‌పటిమతో అందరినీ ఆకర్షించే విధంగా వ్యవహరిం చారు. ప్రజల అభీష్టం మేరకు తాను నడుచుకుంటానని మాటిచ్చారు. దీంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో చేసిన పర్యటనలు ప్రజలకు వివరించిన విధానం సత్ఫలితాలనిస్తుందని పలువురు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**వల్లూరు మండలంలో...**

మండల పరిధిలోని 28 పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దారు అమర్‌నాథ్, ఎంపీడీఓ ప్రభాకర్ పేర్కొన్నారు. దాదాపు 22,562 మంది ఓటర్లు ఉండగా అందులో పురుష ఓటర్లు 10559, మహిళా ఓటర్లు 10,947 మంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు. అలాగే సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, అక్కడ పోలీసుల సహాయంతో వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణ ఉంటుందని, పొరపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు వారు తెలిపారు.

**వీరపునాయునిపల్లె మండలంలో...**

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సోమవారం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సందర్భంగా మండలంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలలో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎన్నికల విధులకు కేటాయించిన అధికారులు సిద్ధమయ్యారు. మండల వ్యాప్తంగా 31 పోలింగ్ కేంద్రాలలో 25032 మంది ఓటర్లు ఉన్నారు. కేంద్రాల వద్ద షామియానాలు, బారికేడ్లు, తాగునీరు ఏర్పాట్లు చేశారు.

**చింతకొమ్మదిన్నె మండలంలో...**

మండల వ్యాప్తంగా సోమవారం జరిగే పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చింతకొమ్మదిన్నె మండలంలోని ఉన్న మొత్తం 53 పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడంతోపాటు అధికారులు కూడా ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. అందుకు అవసరమైన సామాగ్రిని సిద్ధం చేసుకుని పోలింగ్‌కు ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించారు. మరోవైపు పోలీసు యంత్రాంగం గట్టి బందోబస్తు చర్యలు తీసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి భద్రత ఏర్పాటు చేసింది. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఉదయం 7 గంటల నుండే పోలింగ్ జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.



పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లేందుకు ఎన్నికల సామగ్రితో సిబ్బంది

## కడపలో పోలింగ్ సామగ్రి తరలింపు

కడప(కలెక్టరేట్), మే 12: సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా నేడు జరగనున్న పార్లమెంట్, కడప అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సామగ్రిని స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఆయా కేంద్రాలకు తరలించారు. కడప నియోజకవర్గంలో 268 పోలింగ్ కేంద్రాలకు ఆదివారం పోలింగ్ జరగనుంది. సిబ్బంది ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, ఎన్నికల సామగ్రిని పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన వాహనాల్లో తీసుకెళ్లారు.



సమావేశంలో పాల్గొన్న ఎన్నికల నిర్వహణ సిబ్బంది

## సార్వత్రిక ఎన్నికలకు నేడే పోలింగ్

● అత్యధిక ఉష్ణోగ్రతల వల్ల బూత్‌ల వద్ద టెంట్లు ఏర్పాటు

పులివెందుల టౌన్, మే 12: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నాల్గవ విడతలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీకి, పార్లమెంట్‌కు పోలింగ్ నేడు జరగనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రజలందరు ఎప్పుడు ఎప్పుడు అని ఎదురుచూస్తున్న ఎన్నికల సమయం ఆరంభం కానుంది. సోమవారం ఉదయం 7గంటల నుంచి సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎండవేడిమి తట్టుకునేందుకు, వర్షం కురిసన ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రతి పోలింగ్‌కేంద్రం వద్ద టెంట్లు ఏర్పాటుచేశారు. ఆదివారం సాయంత్రానికే ఆయా పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామాగ్రితో సిబ్బంది చేరుకున్నారు. పులివెందుల నియోజకవర్గానికి సంబంధించి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళావాలలో ఎన్నికల పీఓ, ఏపీఓ, ఇతర సిబ్బందికి అవసరమైన సామాగ్రిని ఎన్నికల అధికారి వెంకటేశులు ఆధ్వర్యంలో సామాగ్రిని పంపిణీ చేశారు. ఎన్నికల అధికారులు పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో



పులివెందులలోని పోలింగ్ బూత్‌లో సిబ్బంది

పులివెందుల నియోజకవర్గంలోని అన్ని బూతుల వద్ద ఏ పార్టీ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తకుండా ప్రత్యేక పోలీస్ సిబ్బందిని ఏర్పాటుచేశారు. ఏదైన బూత్ వద్ద ఆందోళనలు కానీ ఇతర సంఘటనలు జరిగినపుడు వెంటనే పోలీసులు స్పందించే విధంగా ప్రత్యేక అధికారులను కూడా ఏర్పాటుచేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పోలీస్ సిబ్బంది ముందస్తుగా తనిఖీ చేశారు. అంతేకాకుండా అదనంగా పోలీస్ దళాలను కేటాయించారు. ఆయా పార్టీలు కూడా ఎన్నికల ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని పార్టీ నాయకులకు అధికారులు సూచించారు. ప్రతి ఎన్నికల బూత్‌లను ఆయా పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు వారివారి ఏజెంట్లను కూడా సిద్ధం చేసుకున్నారు. సోమవారం ఉదయం 5.30గంటల నుంచి ఆయా పార్టీల ఏజెంట్ల ఆధ్వర్యంలో మాక్ పోలింగ్‌ను నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 7గంటల నుంచి ఓటు వేసేందుకు ఓటర్లు పాల్గొనవచ్చు అని అధికారులు తెలిపారు. సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు. వర్షం వస్తే ఎన్నికల సామాగ్రి తరలించే సమయంలో తడవకుండా అధికారులు తగిన ఏర్పాట్లను చేయడం జరిగింది. పోలీస్ బెటాలియన్ ప్రత్యేక దళాలను ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద మోహరించారు. కాగా ప్రజలు కూడా ఎలాంటి గొడవలు, ఘర్షణలను తావివ్వకుండా ప్రతి ఒక్కరూ తమ పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చి స్వేచ్ఛగా తమ ఓటు హక్కును విని యోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

## గాలీవాన బీభత్సం... అరటి తోటలు నేలమట్టం

● లబోదిబోమంటున్న రైతులు



పులివెందుల మండలంలో నేలమట్టమైన అరటి తోటను పరిశీలిస్తున్న అధికారి

పులివెందుల రూరల్, మే 12: ఆదివారం సాయంత్రం గాలీవాన బీభత్సానికి అరటి పంట నేలమట్టమైంది. దాదాపు అరగంట పాటు గాలులు వీచాయి. వర్షం ఎక్కువ సేపు కురవలేదు. దాదాపు వంద ఎకరాలలో అరటి తోటలు ధ్వంసమైనట్లు అధికారిక లెక్క. మండలంలోని నల్లపురెడ్డిపల్లె, యర్రబల్లె తదితర గ్రామాల పరిధిలో అధికంగా పంట నష్టం వాటిల్లింది. దాదాపు వంద ఎకరాలలో పంట నష్టం జరిగి ఉంటుందని ఉద్యానశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఈ గాలుల కారణంగా దాదాపు రెండు కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. అయితే అధికారులు ఎన్నికల విధులకు హాజరవుతున్నందున వారు క్షేత్రస్థాయికి వెళ్లలేకపోయారు. దీంతో మంగళవారం పూర్తిస్థాయిలో అంచనా వేయనున్నట్లు తెలిపారు. గాలులతో పాటు అదేస్థాయిలో వర్షం వచ్చింటే నష్టం మరింత ఎక్కువ ఉండేదని రైతులు చెబుతున్నారు. చేతికొచ్చిన పంట నేలమట్టంకావడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

## కాస్త ఆలస్యమై ఉంటే ఎన్నికల సామగ్రి ముద్దే

● పులివెందులలో సాయంత్రం గాలీవాన



గాలీవానకు చెల్లాచెదురుగా పడిన టెంట్‌లు, కుర్చీలు

పులివెందుల, మే 12: పులివెందుల పట్టణంలోని జేఎన్టీయూ కళాశాలలో ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి ఈవీఎం, వీవీప్యాట్లు ఇతర సామాగ్రి పంపిణీ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పంపిణీ చేపట్టారు. సాయంత్రం 5గంటల సమయంలో గాలీవాన భీభత్సం సృష్టించింది. దాదాపు అరగంట పాటు గాలితో కూడిన వర్షం కురిసింది. అంతకంటే ముందే వర్షం కురిసే అవకాశం ఉండడంతో పులివెందుల ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశులు అప్రమత్తం అయి అప్పటికే కేటాయించిన సిబ్బందిని తమ సామాగ్రితో బస్సుల్లోకి వెళ్లిపోవాలని సూచించారు. దీనితో హుటాహుటిన తమ సామాగ్రితో సిబ్బంది బస్సుల్లోకి వెళ్లిపోయారు. మరికొందరు అక్కడే ఉన్న కళాశాల భవనాల్లోకి వెళ్లిపోయారు. వెంటనే గాలితో కూడిన వర్షం కురిసింది. కాస్త ఆలస్యం అయింటే ఎన్నికల సిబ్బందితో పాటు సామగ్రి కూడా తడచిపోయేవి. కొంతమంది సిబ్బంది అక్కడే ఉండిపోయారు, కుర్చీలు, షామియానాలు కూలిపోయాయి.

## సృష్టికి జీవం అమ్మ..



అమ్మపాదాలు కడుగుతున్న చిన్నారులు

కమలాపురం రూరల్, మే 12 :సృష్టికి జీవం అమ్మ అని.. అమ్మ లేనిదే సృష్టి లేదని.. గ్రేటర్ వాసవీ క్లబ్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు. ఆదివారం స్థానిక అమ్మవారిశాలలో మదర్స్‌డే సందర్భంగా అమ్మలను సన్మానించారు. పిల్లలు వారి తల్లుల కాళ్లు కడిగి తమ ప్రేమను చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పే రులో ప్రేమని, పిలుపులో మాధుర్యాన్ని నింపుకున్న అమృతమూర్తి అమ్మ అన్నారు. అమ్మ ప్రేమ అంత తీయనైంది కనుకనే ఆ భగవంతుడు తనకు కూడా అమ్మ కావాలనుకున్నాడు. ఈలోకాన్ని సృష్టించిన ఆ దేవాదిదేవుడు కూడా మానవ రూపం ధరించి అమ్మ కడుపునే పుట్టాడన్నారు. అంత గొప్పది అమ్మ. అని అమ్మ ప్రేమ గురించి చెప్పినా తక్కువేనన్నారు.

## యూనియన్ బ్యాంక్ ప్రారంభం



నాగులగుట్టపల్లెలో యూనియన్ బ్యాంకు నూతన బ్రాంచ్‌ని ప్రారంభిస్తున్న సిబ్బంది

చక్రాయపేట, మే 12: మండలంలోని నాగులగుట్టపల్లెలో యూనియన్ బ్యాంక్ నూ తన బబ్రాంచ్ మరియు ఏటీఎంను ఆ బబ్యాంక్ జనరల్ మేనేజర్ నవనీత్ కుమార్ (రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి కన్వీనర్) ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళ సంఘాలకు సంబంధించి రుణాలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన రుణాలు అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూతన బ్యాంకు అభివృద్ధికి ప్రజలందరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజనల్ హెడ్ భాస్కర్, డిప్యూటీ రీజనల్ హెడ్ సుధాకర్ రావు, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్, బబ్రాంచ్ మేనేజర్ డి.సురేష్‌బాబు, చక్రాయపేట తహసీల్దార్, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

## ఎన్నికలకు అంతా రెడీ...

పెండ్లిమర్రి, మే 12: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 44పోలింగ్ బూత్‌లలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని షామియానాలు తాగునీరు సౌకర్యం, క్యూలైన్లకు బారికేడ్లు, పోలింగ్ బూత్‌లలో కెమెరాలు ఏర్పాటుచేశామన్నారు. మండలంలో మొత్తం 35733 మంది ఓటర్లు ఉన్నారు.



పోలింగ్ బూత్ వద్ద బారికేడ్లు, షామియానాలు

ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## పెండ్లిమర్రిలో టీడీపీ, వైసీపీ... నువ్వా.. నేనా

పెండ్లిమర్రి, మే 12: మండలంలో రాజకీయ పరిణామాలు అనూహ్యంగా మారిపోయాయి. ఇప్పుడు టీడీపీ, వైసీపీ నువ్వా నేనా అన్నట్లు సాగుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే రవిరెడ్డిపై టీడీపీ నుంచి కృష్ణచైతన్యరెడ్డి పోటీ చేస్తున్నారు. వైసీపీ కంటే టీడీపీ బాగా పుంజుకొని గత ఎన్నికల్లో టీడీపీ పరాజయానికి పెండ్లిమర్రి కూడా ముఖ్యపాత్ర పోషించింది. మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే గతంలో రంపతాడు, మొయిళ్లకాల్వ, మాచునూరు, కొండూరు, చీమలపెంట, నందిమండలం, తుమ్మలూరు, గొందిపల్లె, గంగనపల్లె, వెల్లటూరు, పాత సంగటిపల్లె పంచాయతీల్లో మెజార్టీ వచ్చింది. అయితే ఈసారి ఇవే పంచాయతీల నుంచి టీడీపీలోకి వైసీపీ నేతలు వలసలు వచ్చారు. నందిమండలం పంచాయతీలో ఆరువేల ఓటర్లు ఉన్నారు. అయితే అక్కడ నుంచి వైసీపీ ముఖ్యనేత శ్రీధర్‌రెడ్డి టీడీపీలోకి జంప్ అయ్యారు. ఇటీవల టీడీపీకి ఎప్పుడూ రాని ఆదరణ వచ్చింది. నందిమండలంలో జరిగిన టీడీపీ రోడ్‌షోకు ప్రజల నుంచి అనూహ్యస్పందన లభించింది. గతంలో వైసీపీకి ముఖ్యనేతగా ఉన్న రామ్మోహన్‌రెడ్డి మృతిచెందడం తీరని లోటు. అదే వైసీపీ నేత శ్రీధర్‌రెడ్డి టీడీపీలోకి రావడం ప్లస్‌గా మారింది. టీడీపీ ఓటింగ్ భారీగా పెరగనుందని అంచనా వేస్తున్నారు. కొత్త గంగిరెడ్డిపల్లె పంచాయతీలో కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన చింతకుంట శ్రీనివాస్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి వారి అనుచరులతో కలిసి టీడీపీలో చేరడం వైసీపీకి మైనస్ అయింది. గంగనపల్లె పంచాయతీలో టీడీపీ ముఖ్యనేత సింగపూర్ రాజారెడ్డి వైసీపీ నుంచి ముఖ్యనేతలను టీడీపీలో చేర్చడం కలిసి వచ్చింది. ఎమ్మెల్యే రవిరెడ్డి సొంత క్యాడర్‌ను కూడా పట్టించుకోకుండా వదిలేశారు. ఒకరిద్దరికి తప్ప మిగతా వారికి ప్రయోజనం చేకూర్చలేదు. ఇది వైసీపీ క్యాడర్‌లో అసంతృప్తి లేపింది. ఇందులో భాగంగానే ఆరు నెలల క్రితం నల్లయ్యగారిపల్లెకు చెందిన కీలక నేత ధనుంజయరెడ్డి, కొండూరుకు చెందిన రాజారెడ్డి కమలాపురంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. అప్పట్లో ఆ సమావేశానికి చాలా మంది వైసీపీ నేతలు హాజరయ్యారు. అందరి మదిలో ఎమ్మెల్యే ఏం చేయలేదనే ఫీలింగ్ ఉంది. గత ఎన్నికల్లో సొంత లెక్క ఖర్చుపెట్టుకొని రక్తం పూసుకొని పనిచేశారు. అయితే ఐదేళ్ల తర్వాత ఆయన పాలన చూసి తత్వం బోధపడి ఇప్పుడంతా సైలెంట్‌గా ఉన్నారు. పాలనంతా మండలంలో అక్రమ గ్రావెల్, మట్టి అక్రమ రవాణా, రెవెన్యూ అధికారుల సహకారంతో కొండలు, గుట్టలు ఆక్రమించడం, యూనివర్సిటీ ప్రాంతంలో భూములకు విపరీతమైన డిమాండ్ రావడంతో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని అక్రమ లేఅవుట్లు వేయడం, అలాగే పంటల బీమాలో కూడా కొంతమంది రైతులకు అన్యాయం జరగడం ఆ పార్టీకి మైనస్ అయ్యాయి. ముఖ్యమంత్రి సహాయ నిధి డబ్బులో కూడా కొంతమంది చేతివాటం ప్రదర్శించడం, అనామకులైన రైతుల భూములను కొంత మంది వైసీపీ నేతలు ఆక్రమించుకోవడంతో రైతులు ఆందోళనగా ఉన్నారు. వీరంతా ఇపుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారు. సోలార్ భూముల వ్యవహారం కూడా వైసీపీ కొంపముంచింది. పైగా పుత్తా కుటుంబం నాలుగుసార్లు ఓడిపోయారు. ఒక్క అవకాశం ఇద్దామని ఈ దఫా జనాల్లో మార్పు వచ్చేసింది. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు రైతులు, మహిళలు, యువత బాగా కనెక్ట్ అయ్యారు. ముఖ్యంగా పించన్ పెంపు గ్రామాల్లో బాగా పాతుకుపోయింది. వైసీపీ నుంచి పెద్దఎత్తున వలసలు రావడం టీడీపీకి బాగా కలిసి వచ్చింది ఢీ అంటే ఢీ అనేస్థాయికి వెళ్లిపోయింది. ఈసారి మాకు మండలంలో మెజార్టీ రాదని వైసీపీ నేతలే అంతర్గత సంభాషణలు చర్చించుకుంటున్నారు.

# సమరోత్సాహంలో టీడీపీ

- ఆత్మరక్షణ స్థాయి నుంచి ప్రత్యర్థికి ముచ్చెమటలు పట్టించే స్థాయికి
- నారా లోకేశ్ 'యువగళం' తరువాత పెరిగిన జోష్
- శ్రేణుల మధ్య ఐక్యత పెంచిన అంగళ్లు, పుంగనూరు కేసులు
- ప్రధాని సభ సక్సెస్‌తో మరింత ఉత్సాహం



పీలేరు, మే 12: ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి తీరాలన్న కసితో పీలేరు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు సమరోత్సాహంతో ఉన్నారు. గడిచిన ఐదేళ్లుగా ఎదుర్కొన్న అవమానాలు, అక్రమ కేసులు, కక్ష సాధింపులకు చెక్ పెట్టాలన్న లక్ష్యంతో దూసుకెళుతున్నారు. ఐదేళ్ల నాడు ఆత్మరక్షణ స్థాయిలో ఉండి పార్టీలో ఉన్న వారిని కాపాడుకుంటే చాలు అన్న స్థితి నుంచి ప్రస్తుతం ప్రత్యర్థి పార్టీకి ముచ్చెమటలు పట్టించే స్థాయికి చేరుకుంది టీడీపీ. వైసీపీ నాయకుల ఆక్రమణలే ఆలంబనగా, వారి అక్రమాలే ప్రచారాస్త్రాలుగా పోరాటం ఆరంభించిన పీలేరు టీడీపీ శ్రేణులకు చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు తోడురాగా, విజయవంతమైన అగ్రనేతల పర్యటనలు, ప్రచార సభలు కలిసివచ్చి నేడు గెలుపు దిశగా కృషి చేస్తున్నాయి. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సాగించిన 'పోరాట' రాజకీయాలు ఫలించి 2019లో ఆత్మరక్షణలో ఉన్న స్థాయి నుంచి వైసీపీకి ముచ్చెమటలు పట్టించే స్థాయికి చేరుకుంది. యువనేత నారా లోకేశ్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రకు పీలేరు నియోజకవర్గంలో అనూహ్య స్పందన లభించడంతో ధైర్యంగా వీధుల్లోకి వచ్చిన పార్టీ శ్రేణులు, ఎక్కడికక్కడ అధికార పార్టీపై సాగించిన పోరాటాల కారణంగా ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు, ప్రత్యర్థి పార్టీలోని నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా టీడీపీలోకి రావడం ప్రారంభమైంది. ఆ తరువాత జరిగిన చంద్రబాబు 'ప్రజాగళం' ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ సభ సూపర్ సక్సెస్‌తో పీలేరు నియోజక వర్గంలోని టీడీపీ శ్రేణులు కదం తొక్కుతున్నారు.

### వైసీపీ నేతల ఆక్రమణలే ఆలంబనగా చెలరేగిన నల్లారి

2019 ఎన్నికల తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నల్లారి కుటుంబాన్ని ఒంటరిని చేయాలన్న ఏకైక లక్ష్యంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి పీలేరులో రాజకీయాలు సాగించారు. 2019 ఎన్నికల్లో రెండవసారి ఓటమి ఎదురైనా, ప్రత్యర్థి వర్గం పదేపదే ఇబ్బంది పెడుతున్నా, నమ్ముకున్న వారు వరుసగా వైసీపీలో చేరిపోతున్నా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ధైర్యం కోల్పోకుండా పార్టీని, తనను నమ్ముకున్న ద్వితీయ శ్రేణి క్యాడర్ నాయకులతోనే పార్టీని నడిపించారు. ఆ క్రమంలో ఆయనకు వైసీపీ నాయకులు యథేచ్ఛగా సాగించిన భూఆక్రమణలు చేతికి అందివచ్చిన అవకాశంలా మారాయి. అధికారంలోకి వచ్చిందే తడవుగా వైసీపీ నాయకులు నియోజకవర్గ వ్యాప్తంగా అనేకచోట్ల ప్రభుత్వ, డీకేటీ, ప్రైవేటు భూముల అక్రమణలకు తెగపడ్డారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవడం, డీకేటీ భూములనైతే ప్రభుత్వ రికార్డుల్లో పేర్లు మార్చి తమ పరం చేసుకోవడం, ప్రైవేటు వ్యక్తులను బెదిరించి అయిన కాడికి వారి వద్ద కొనుగోలు చేయడం వంటి పనులతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల్లో అభద్రతాభావాన్ని కల్పించారు. ఇదే అంశాన్ని నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తన పోరాటానికి ఆయుధంగా మలుచుకున్నారు. పీలేరు పట్టణంతో పాటు, దానికి ఆనుకుని ఉన్న ఎర్రగుంటపల్లె, దొడ్డిపల్లె, గూడరేవుపల్లె, బోడుమల్లు వారిపల్లె, ముడుపులవేముల గ్రామ పంచాయతీలలో అధికార పార్టీకి చెందిన నాయకులు సుమారు రూ.400 కోట్లు విలువజేసే 600 ఎకరాల భూములను ఆక్రమించుకున్నారని గూగుల్ మ్యాప్స్ వంటి సాంకేతిక ఆధారాలతో జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్ర లోకాయుక్త, రాష్ట్ర హైకోర్టులో ఫిర్యాదు చేశారు. 2021లో కిశోర్ ప్రయత్నం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆయన అందించిన ఆధారాల కారణంగా ఒత్తిడి పెరగడంతో ఆక్రమణలపై విచారణకు అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ హరినారాయణ, అప్పటి మదనపల్లె సబ్-కలెక్టర్ జాహ్నవిని ఆదేశించారు. ఆమె పర్యవేక్షణలో ఆరుగురు తహసీల్దార్లతో కూడిన 60 మంది సభ్యుల బృందం సుమారు రెండు నెలలపాటు విచారణ జరిపింది. కిశోర్ కుమార్ రెడ్డి సేకరించిన ఆధారాలన్నీ నిజమేనని కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. దీంతో కిశోర్‌కుమార్‌రెడ్డి నైతిక విజయం సాధించినట్లైంది. అప్పటి నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా నిస్తేజంగా ఉన్న టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం మొదలైంది. కరోనా కారణంగా రెండేళ్లపాటు ఎటువంటి కార్యక్రమాలు చేపట్టకపోయినా పార్టీ క్యాడర్‌కు అందుబాటులో ఉంటూ కిశోర్‌కుమార్‌రెడ్డి ఆ ఉత్సాహం నీరుగారి పోకుండా చూసుకున్నారు.

### 'యువగళం'తో పీలేరులో పెరిగిన జోష్

2023 మార్చిలో పీలేరులో జరిగిన నారా లోకేశ్ 'యువగళం' పాతయాత్ర పీలేరు టీడీపీలో నవశకానికి నాంది పలికింది.

### గత అభివృద్ధిని చూసి ఆదరించండి: నల్లారి

రాజకీయాలను, అధికారాన్ని స్వప్రయోజనాల కోసం కాకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసమే వెచ్చించాను. గత పదేళ్లుగా ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలిచిన వారు అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. గత అభివృద్ధిని తిరిగి పరుగులు పెట్టించాలంటే నన్ను ఆదరించండి. ప్రజలు ఈసారి మంచి నిర్ణయం తీసుకుని నన్ను గెలిపించండి.

# ఒక్క అవకాశం ఇస్తే..

- పథకాలను అటకెక్కించి
- రైతు సంక్షేమాన్ని విస్మరించి..
- ఐదేళ్ల పాలనలో రైతన్నల నడ్డి విరిచిన జగన్



కడప (ఎన్టీఆర్ సర్కిల్), మే 12: జిల్లాలో చిన్న, సన్నకారు, మధ్య, పెద్ద తరహా రైతులు 4,88,672 మంది ఉన్నారు. వీరంతా వ్యవసాయపై ఆధార పడి జీవిస్తున్న వారే. ఇటీవల కాలంలో ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రతికూల పరిస్థితులతో అనేక కష్టాలను చవి చూశారు. ఆదుకోవాల్సిన జగన్ ఐదేళ్ల పాలనలో రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారు. అసలే కరువు జిల్లా. వర్షాలు కూడా అంతంత మాత్రమే. అరకొరగా పండిన వర్షాల ఆధారంగా చేసుకుని పండించిన పంటకు గిట్టుబాటు ధర కలిగేంత వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో నిల్వ ఉంచి దిగుబడులపై రుణం పొందే రైతుబంధు పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు పన్నుల వసూళ్లకే పరిమితం అయ్యాయి. సూక్ష్మ సేద్య పరికరాలు పంపిణీలో కూడా నిర్లక్ష్యం వహించారు.

> ముఖ్యమంత్రి జగన్ గత ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వాలంటూ ఓటర్లను వేడుకున్నారు. తాను అధికారంలోకి రాగానే రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకుంటా... తన తండ్రి బాటలోనే పయనిస్తూ వ్యవసాయాన్ని పండగ చేస్తానని ప్రగల్భాలు పలికారు. అధికారం దక్కాక అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారు. ఇక రైతులను కోలుకోలేని దెబ్బతీశారు.

### కలగా మిగిలిన జలకళ

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2020 సెప్టెంబరులో వైఎస్ఆర్ జలకళ పథకానికి శ్రీకారం చుట్టింది. నియోజకవర్గ కేంద్రాల్లో రిగ్‌లు ఏర్పాటు చేసి తద్వారా సమీప మండలాల్లోని రైతులకు బోర్లు వేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. దీంతో వేలాది మంది చిన్న సన్న కారు రైతులు బోర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో బోర్లు తవ్వించేందుకు అనుమతిచ్చారు. అయితే రిగ్ వాహనాల యజమానులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆ పథకం మధ్యలోనే ఆగిపోయింది. .

### యంత్ర పరికరాలు ఏవీ..

వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చిన్న సన్నకారు రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను పంపిణీ చేసేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ పథకం ద్వారా పరికరాలు మొక్కుబడిగా అందజేస్తున్నారు. ప్రధానంగా పురుగుమందుల పిచికారి, చేతితో, కాలితో తొక్కే పవర్ స్ప్రైవాన్ స్ప్రేయర్లను ఇవ్వాలంటూ రైతులు అభ్యర్థిస్తున్నప్పటికీ జగన్ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. వ్యవసాయ ఉత్పత్తుల ఆరబోతల కోసం టార్పలిన్ పట్టలు ఇవ్వకుండా రైతాంగాన్ని ఇబ్బందులు పెట్టారు. దీంతో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట దిగుబడులను రోడ్లపై ఆరబోసుకోవాల్సిన పరిస్థితి. రైతు రథం హార్వెస్టంగ్‌లాంటి పెద్దయంత్రాలను రైతు బృందాల పేరుతో ఈ ప్రభుత్వం ఇచ్చినప్పటికీ అవి అధికార వైసీపీ నాయకులకే పరిమితం అయ్యాయి.

### అలంకారప్రాయంగా ఆర్‌బీకేలు

వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వ్యవసాయాన్ని మరింత చేరువ చేస్తున్నామంటూ గొప్పలు చెప్పి.. ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. విత్తు నుంచి పంట కొనుగోలు వరకు ఈ కేంద్రాల ద్వారానే నిర్వహిస్తామని బీకరాలు పలికి... అమలులో చిత్తశుద్ధి చూపించలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో 836 రైతు భరోసాకేంద్రాలు ఉన్నాయి. ఒక్కో భవన నిర్మాణానికి దాదాపు 24 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. ఈకేంద్రాల ద్వారానే విత్తనాలు, ఎరువులు, రైతులకు పంపిణీ చేస్తామని చెబుతున్నప్పటికీ రైతు నచ్చి మెచ్చేటువంటి రకాలకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు కాకుండా ప్రభుత్వానికి నచ్చినవి మాత్రమే రైతులకు అంటకట్టే పరిస్థితి ఏర్పడింది. ఇక పురుగు మందుల ఊసే లేదు. వీటికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్‌ల పరిస్థితి అలాగే ఉంది. ప్రతి నియోజకవర్గ కేంద్రానికి ఒక అగ్రిల్యాబ్ నిర్మించారు. భవనాల నిర్మాణం, యంత్ర పరికరాలు సామగ్రి కొనుగోలు మౌలిక వసతుల కల్పనకు ఒక్కో కేంద్రానికి రూ.50 లక్షలకు పైగా ఖర్చు చేశారు. కానీ క్షేత్రస్థాయిలో రసాయనాలు ఇతర పరికరాలు అందుబాటులో లేకపోవడంతో అగ్రి ల్యాబ్ లు నిరుపయోగంగా ఉన్నాయి. .

### మూసివేత దిశగా భూసార కేంద్రాలు

భూసార పరీక్షల కేంద్రాలకు జగన్ ప్రభుత్వ హయాంలో నిధుల గ్రహణం పట్టింది. గడిచిన మూడేళ్లకాలంలో వీటి నిర్వహణ కోసం అరకొరగా నిధులు ఇస్తున్నారు. దీంతో భూసార పరీక్ష కేంద్రాలు మూతపడే పరిస్థితుల్లో ఉన్నాయి. ఇప్పటికే ప్రొద్దుటూరులోని భూసార పరీక్ష కేంద్రం మూతపడగా.. ఊటుకూరులోని సంచార వాహనానికి బ్రేకులు పడ్డాయి. ఇక యంత్ర పరకరాలు, రసాయనాల కొనుగోలు, పత్రాల ముద్రణకు నిధులులేక పరీక్షలను అంతంత మాత్రంగానే కొనసాగిస్తున్నారు.

### కర్షకులకు తప్పని కరెంటు కష్టాలు

మీ బిడ్డ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతాంగానికి అండగా ఉంటుంది. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ పగటి పూట 9గంటలు ఇస్తామంటూ జగన్ గొప్పగా చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 2.50 లక్షల కనెక్షన్లు ఉన్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం 7గంటలు ఇవ్వడం కూడా కష్టంగా ఉంది. అది కూడా పగలు 4 గంటలు, రాత్రి 3గంటల చొప్పున విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఒకరకంగా గాలి వీచినా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే మరమ్మతు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. కొత్తగా వ్యవసాయ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే వెంటనే సామగ్రి ఇవ్వడంలేదు. నెలల కొద్దీ నిరీక్షణ చేయాల్సి వస్తోంది. విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన రైతన్నలకు సకాలంలో పరిహారం అందక వారి కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయి.

### కనిపించదా.. కరువు

సీఎం జగన్ తన సొంత జిల్లాలో ఏర్పడ్డ కరువు పరిస్థితులు కనిపించక పోవడం విచారకరమని రైతు సంఘాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో కనీసం సాధారణ వర్షపాతం కూడా నమోదైన పరిస్థితులు లేవు. 2023-24 సంవత్సరాల్లో జిల్లాలో సాధారణ వర్షపాతం 637.6 మి.మీ నమోదు కావాల్సి ఉండగా కేవలం 429.3 మి.మీ వర్షపాతం నమోదైంది. సగటున 32.7 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఖరీఫ్‌లో 77135 హెక్టర్లలో వివిధ రకాల పంటలు సాగు కావాల్సి ఉండగా 76,005 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. అదేవిధంగా రబీలో 1,48,820 హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా 1,32,857 హెక్టార్లలో పంటలు సాగుకు నోచుకున్నాయి. సరిపడా వానలు రాకపోవడంతో జిల్లాలో కరువు విలయతాండవం చేసింది. ఆదుకోవాల్సిన జగన్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. తిరిగి మరోసారి అవకాశం ఇవ్వాలంటూ రైతాంగాన్ని మభ్యపెట్టే విధంగా ముఖ్యమంత్రి జగన్‌తో పాటు ఆపార్టీ నేతలు తప్పుడు వాగ్దానాలు చేస్తున్నారు.

# వైసీపీ దురాగతాలతోనే టీడీపీ వైపు ప్రజల మొగ్గు

- టీడీపీకే జనం జైకొడతారని ఆ పార్టీ నాయకుల ఆశాభావం
- పోలింగ్ కేంద్రాలపై పూర్తి స్థాయి దృష్టి
- టీడీపీ శ్రేణుల జోష్



రాజంపేట, మే 12: రాజంపేట నియోజకవర్గంలో టీడీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్న సుగవాసి బాలసుబ్రమణ్యం గెలుపు తనదేనని ధీమాగా ఉన్నారు. అధికార వైసీపీ చేసిన అరాచకాలు, ప్రజా వ్యతిరేకతే తమను గెలుపు ముంగిటకు తీసుకెళతాయని టీడీపీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులంతా ఏకతాటిపైకి వచ్చి బాలసుబ్రమణ్యంకు మద్దతుగా భారీ ఎత్తున ప్రచారం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ దాదాపుగా వెళ్లి అధికార వైసీపీ చేసిన దురాగతాలను వివరించడంలో సఫలీకృతులయ్యారు. అధికార పార్టీ ఓటర్లకు భారీగా డబ్బులు పంపిణీ చేసినా ప్రజలు మాత్రం తమకే ఓట్లు వేస్తారని టీడీపీ నాయకులు చెబుతున్నారు. రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఆరు మండలాలతో పాటు రాజంపేట మున్సిపాలిటీ ఉంది. ఇందులో 288 పోలింగ్ కేంద్రాలున్నాయి. రెండు రోజులుగా ప్రధాన పార్టీల నేతలు తమ బూత్ లెవల్ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రధానంగా అధికార వైసీపీ పార్టీ అధికమొత్తంలో ఓటర్లకు నగదు రూపేణా తాయిలాలు అందజేశారు. వైసీపీకి దీటుగా టీడీపీ నేతలు పైసలు పంపిణీ చేయకపోయినా తాము ఖచ్చితంగా గెలుస్తామని అధికార పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని నోటుకు ఓటు పడదని, ఖచ్చితంగా గెలిచితీరుతామన్న నమ్మకంతో ఎన్నికలపై దృష్టి సారించింది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల ప్రజావ్యతిరేక విధానాలను కొనసాగించారని దోపిడీలు, దౌర్జన్యాలు చేశారని టీడీపీ నేతలు భావిస్తున్నారు. ప్రధానంగా రాజంపేటలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేయలేదని, ఒక్క సిమెంటు రోడ్డు వేయలేదని రాజంపేట పట్టణంలో ఒక్క అభివృద్ధి పని జరగలేదని దాంతో పాటు రాజంపేట, సుండుపల్లి, వీరబల్లి, ఒంటిమిట్ట, నందలూరు మండలాల్లో ఏ చిన్నపాటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని టీడీపీ నేతలు ప్రజలకు వివరించారు.



సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేటను జిల్లా కేంద్రం చేయకపోవడం ద్వారా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు జిల్లా ప్రకటన చేయడం తమకు ఓట్ బ్యాంకు బాగా కలిసివస్తుందని టీడీపీ నాయకులు గట్టి నమ్మకంతో ఉన్నారు. దాంతో పాటు అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం, దానిని పునర్ నిర్మించకపోవడం, బాధితులకు న్యాయం చేయకపోవడం ముంపు బాధిత గ్రామాల్లో తమకు కలిసివస్తుందని టీడీపీ భావిస్తోంది. అదే విధంగా రాజంపేట నియోజకవర్గానికి మంజూరు చేసిన మెడికల్ కాళాశాల ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నా దానిని వైసీపీ నాయకులు పట్టించుకోకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. రైతుల్లో పెద్ద వ్యతిరేకత ఉందని, అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంత రైతులు టీడీపీకి ఓటు వేస్తారనుకుంటున్నారు. ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతాల్లో 22 వేల ఎకరాల ఆయకట్టు భూమి ప్రాజెక్టు తెగిపోవడం వల్ల బీళ్లుగా మారిందని, భూగర్భజలాలు అడుగంటాయని, తాగునీరు లేక అటు రాజంపేట మండల ఎగువ ప్రాంతంలో ఆ ప్రాజెక్టు రైతాంగమంతా టీడీపీకి ఓటు వేస్తుందనుకుంటున్నారు. సుండుపల్లి, వీరబల్లి మండలాల్లో రాయచోటి జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్నప్పటికీ అరగంటలో అక్కడి చేరుకున్నప్పటికీ ఆ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్డీవో కార్యాలయాన్ని వారికి కేటాయించకుండా ఎంతో దూర ప్రాంతంగా ఎన్నో కొండలు, గుట్టలు ఏర్లు దాటి వెళ్లాల్సిన రాజంపేటకు ఆర్డీవో కేంద్రాన్ని కేటాయించడం పట్ల ఆ ప్రాంత ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని కావున ఆ రెండు మండలాల ప్రజలు టీడీపీకి మొగ్గు చూపుతారనుకుంటున్నారు.

టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు తన తండ్రి పాలకొండ్రాయుడు హయాం నుంచి సుండుపల్లె పెట్టని కోటని, అక్కడ బీసీలు ఎక్కువగా ఉన్నారని గత నియోజకవర్గాల పునర్విభజన కాక ముందు సుగవాసి అక్కడ ప్రాతినిధ్యం వహించడం వల్ల ఆ మండలం బాలసుబ్రమణ్యంకు పెట్టని కోటగా తయారవుతుందనుకుంటున్నారు. ఇక దానిని ఆనుకుని ఉన్న వీరబల్లి మండలానికి సుగవాసికి పెద్ద సంబంధాలు ఉన్నాయి. ఆ ప్రాంతం కూడా టీడీపీకి అనుకూలిస్తుందనుకుంటున్నారు. రాజంపేట మండలం అత్యధికంగా బీసీలు, ముస్లింలు అధికంగా ఉన్నారు. అగ్రవర్ణాల ఆధిపత్యం ఎక్కువ. రాజంపేట పట్టణం టీడీపీకి అనుకూలంగా ఉంది. రాజంపేట రూరల్ మండలంలో అనేక ప్రాంతాలు టీడీపీకి పెట్టని కోటలుగా ఉన్నాయి. కమ్మ, బలిజ, క్షత్రియ సామాజిక వర్గంతో పాటు రెడ్ల సామాజిక వర్గంలోని బలమైన నాయకులు టీడీపీ వైపు మొగ్గు చూపడం వల్ల రాజంపేట మండలం కూడా టీడీపీకి కలిసి రానుంది.

నందలూరు మండలంలో బాలసుబ్రమణ్యంకు సంబంధించిన సామాజికవర్గం ఆది నుంచి బలంగా ఉంది. దానికి తోడు బీసీలందరూ టీడీపీ వైపు ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వర్గమంతా బాలసుబ్రమణ్యంకు మద్దతు పలకారు. ఈ మండలంలో కూడా టీడీపీకి మెజార్టీ వస్తుందనుకుంటున్నారు. ఒంటిమిట్టలో నువ్వా నేనా అన్న విధంగా ఉన్నా రూ.130 కోట్లతో ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా ఒంటిమిట్టకు సోమశిల వెనుక జలాల నుంచి నీళ్ల అందించిన విషయం టీడీపీకి కలిసి వస్తుందనుకుంటున్నారు. సిద్దవటం మండలంలో మండల కేంద్రమైన సిద్దవటం టీడీపీకి పెట్టని కోట. అక్కడ కూడా వైసీపీలోని ఎమ్మెల్యే మేడా వర్గమంతా టీడీపీకి పనిచేస్తోంది. అందువల్ల ఆరు మండలాల్లో తప్పక మెజార్టీ సాధిస్తామని, అంతేకాక వైసీపీపై ఉన్న వ్యతిరేకత తమకు కలిసి వస్తుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలసుబ్రమణ్యం గట్టి నమ్మకంతో తమ ఎన్నికల కేడర్‌ను అప్రమత్తం చేసి ఎన్నికలకు సిద్ధమయ్యారు. మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తమ కూటమి నేతల బలమే తన విజయానికి తోడ్పడతాయని ముందుకు సాగుతున్నారు.

# సైకిల్ జోరుతో స్పీడు తగ్గిన ఫ్యాను

- రాయచోటిలో వైసీపీ కోటకు బీటలు
- రోడ్‌షోలు, చంద్రబాబు ప్రజాగళంతో జోష్‌లో టీడీపీ శ్రేణులు
- రాయచోటిలో పూర్వ వైభవం దిశగా టీడీపీ అడుగులు

రాయచోటిటౌన్, మే 12: ఇన్నేళ్లుగా వైసీపీ అభ్యర్థికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తూ వచ్చిన రాయచోటి ప్రజలకు... గడిచిన ఐదు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న అవినీతి, అక్రమాలు, అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, భూదందాలతో విసుగుచెందారు. మట్టి, ఇసుక, మద్యం మాఫియాలతో, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు విద్యుత్ చార్జీలు, బస్సు చార్జీల పెంపుదలను చూసి చెత్త పన్ను, ఇంటి పన్ను ఇలా ఎన్నో రకాలుగా వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న బాదుడే బాదుడుతో భయభ్రాంతులకు గురయ్యారు. సామాన్య ప్రజలు రాబోయే ఎన్నికల్లో మార్పు కోసం ఎదురుచూస్తున్నారు. దీనికి తోడు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు తీసుకొచ్చిన సూపర్ సిక్స్ పథకాల మేనిఫెస్టోతో ప్రజలు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి రాయచోటి నియోజకవర్గంలో సైకిల్ జోరు స్పీడ్ అందుకుంది. దీనికి తోడు ముక్కుసూటి మనిషి, మాట చెబితే ఎంత దూరమైనా మాట కోసం వెళ్లే మాజీ ఎమ్మెల్యే మండిపల్లి నాగిరెడ్డి కుమారుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి టీడీపీ అధిష్టానం టికెట్ కేటాయించడంతో టీడీపీ మరింత ఊపందుకుంది. అంతేగాక నాలుగు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీకాంత్‌రెడ్డి అబద్ధాలతో, మాయలతో ప్రజలను మభ్య పెడుతూ కేవలం కొంత మందికే న్యాయం చేస్తూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం మరిచారనే విమర్శలున్నాయి. ఆయనపై రాయచోటి పట్టణ ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలకు కూడా నమ్మకం సన్నగిల్లిందని చెబుతున్నారు. ఖచ్చితంగా ఈ సారి జరగబోయే ఎన్నికల్లో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇద్దామంటూ నియోజకవర్గ ఓటర్లు బాహాటంగా చెబుతుండడంతో టీడీపీ గెలుపు తథ్యమని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన అనంతరం మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి టీడీపీ టికెట్ కేటాయించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీకి పూర్వవైభవం సంతరించుకున్నట్లయింది. అంతేగాక అధిష్టానం పార్టీ టికెట్ కేటాయించినప్పటి నుంచి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ, అన్ని మండలాల నేతలను సమష్టిగా మద్దతు కూడగట్టారు. దీనికి తోడు ప్రచారంలో దూసుకుపోవడంతో టీడీపీ రోజు రోజుకు పుంజుకుంది. ఒకవైపు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నా మరోవైపు మండిపల్లి కుటుంబ సభ్యులు రాయచోటి పట్టణంతో పాటు సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మండిపల్లికి ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ విజ్ఞప్తి చేస్తుండడంతో ఓటర్లు ఆలోచనలో పడ్డారు.

ఇదిలా ఉండగా గత నాలుగు దఫాలుగా వరుసగా ఎన్నికవుతూ వస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వెంట నడిచిన పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరడంతో రాయచోటి పట్టణంలో వైసీపీ కోటకు బీటలు పడ్డాయని చెప్పడంలో సందేహం లేదు. ప్రధానంగా మాజీ మున్సిపల్ చైర్మన్ నసిబున్‌ఖానం, మాజీ కోఆప్షన్ సభ్యుడు సల్లావుద్దీన్ దంపతులతో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త కోడి శ్రీనివాసులరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ కన్వీనర్, 18వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ పి.మదన్‌మోహన్‌రెడ్డితో పాటు 24వ వార్డు కౌన్సిలర్ కూడా టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో పట్టణంలో టీడీపీకి మరింత బలం పెరిగిందని చెప్పడంలో సందేహం లేదు. అంతేగాక రాజంపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాయచోటి పట్టణంలో రోడ్‌షో నిర్వహించడంతో పాటు ఎన్నికల నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ చేపట్టడంతో నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఇదే సమయంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం రోడ్‌షోలో భాగంగా రాయచోటికి వచ్చి రోడ్‌షోలో మైనార్టీల సంక్షేమం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం పలు రకాల వాగ్దానాలు చేయడంతో టీడీపీ శ్రేణుల్లో మరింత జవసత్వాలు నింపినట్లయింది. మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట చెబితే మడమతిప్పడు అనే నినాదంతో నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేపట్టడమే కాకుండా రాబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలనే కృతనిశ్చయంతో రాయచోటి నియోజకవర్గ ప్రజలు ఉన్నట్లు తెలుస్తోంది. రాయచోటి వ్యాప్తంగా ఏ నోట విన్నా మండిపల్లి రాముడన్న అనే నినాదం వినిపిస్తుండడంతో నాలుగు సార్లు శ్రీకాంత్‌రెడ్డికి అవకాశం ఇచ్చాము. రాంప్రసాద్‌రెడ్డి కూడా ఒకసారి అవకాశం ఇద్దామనే విధంగా ఓటర్లలో మార్పు వచ్చినట్లు తెలుస్తోంది. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైసీపీ కోటకు బీటలు పడనున్నాయని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఇటు రాయచోటిలోనూ అటు రాష్ట్రంలోనూ టీడీపీ విజయ ఢంకా మోగిస్తుందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



ర్యాలీ సందర్భంగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు (ఫైల్)



రాయచోటిలో రాయుడుకాలనీలో రాంప్రసాద్‌రెడ్డికి పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతున్న ప్రజలు (ఫైల్)

# పసిడిపురిలో మార్పు తప్పదు

పెద్దాయన వైపు ఓటర్ల మొగ్గు ● రాచమల్లుపై గూడు కట్టుకున్న వ్యతిరేకత

ప్రొద్దుటూరు సిద్ధం సభలో ఏ హామీ ఇవ్వని జగన్ ● రోడ్‌షోలో హామీలిచ్చిన బాబు

నేడు అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్న ఓటర్లు

ప్రొద్దుటూరు, మే 12: కడపజిల్లా రాజకీయాల్లో కీలక నియోజకవర్గాల్లో ఒకటి ప్రొద్దుటూరు. పదేళ్లగా వైసీపీ అభ్యర్థి రాచమల్లు ప్రసాద్ రెడ్డిని గెలిపించిన ఓటర్లు ఈ సారి మార్పు తప్పదన్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా అధికారంలో ఉండగా ఎమ్మెల్యే రాచమల్లు చెప్పిన హామీలేవి నేరవేర్చలేక పోయారు. ఐదేళ్లలో కేవలం రూ. 512 కోట్ల మేర నిధులు మంజూరు చేయించగలిగారు. స్వయంగా సీఎం జగన్ ప్రొద్దుటూరులో 13 పనులకు శిలాఫలకాలు వేసి శంకుస్థాపనలు చేశారు. అందులో ఏ ఒక్క పని పూర్తి కాలేదు. జరిగిన పనులకు పట్టుమని పదికోట్ల బిల్లులు కూడా మంజూరు కాలేదు. అంతేకాకుండా రెండుసెంట్ల స్థలంలో పేదలకు ఇళ్ళు నిర్మించి ఇస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా రాచమల్లు రెండుసెంట్ల స్థలం లబ్ధిదారులకు ఇప్పించలేకపోయారు. ఆవాసాలకు పనికిరాని భూముల్లో సెంటు స్థలం పట్టా ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి లబ్ధిదారు నుంచి మొదటి విడత రూ.35 వేలు, రెండో విడత రూ.35 వేల వంతున మొత్తం రూ.70 వేలు వసూలు చేశారు. కానీ మూడేళ్ల గడిచినా మూడు వందల ఇళ్ళలు కూడానిర్మించలేక పోయారు. దీంతో ప్రజల్లో ఆయన హామీల పట్ల నమ్మకం పోయింది. భూ ఇసుక దందా, క్రికెట్, మాట్కా, సెటిల్ మెంట్లు పోలీసు స్టేషను రెవెన్యూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి నెలమాముళ్ల పెద్ద ఎత్తున వసూళ్ల చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రాచమల్లు ఆయన బావమరిది బంగారురెడ్డి ఇసుక భూ దందాలు అక్రమ సంపాదనపై ప్రశ్నించిన టీడీపీ అధికార ప్రతినిధి బీసీ నేత నందం సుబ్బయ్యను పట్టపగలే వందలాది మంది చూస్తుండగా అతికిరాతకంగా నరికి చంపారు. ఈ హత్య ప్రొద్దుటూరు ప్రజల్లో తీవ్ర భయోత్పాతాన్ని కలిగించింది. ఫలితంగా బీసీల్లో తీవ్ర వ్యతిరేకతను తెచ్చింది. ఇందులో అసలు సూత్రదారులైన రాచమల్లు, బంగరురెడ్డి కమిషనర్ రాధ పేర్లు కేసులో పెట్టకుండా పోవడంతో వీరందరినీ చేర్చాలని సుబ్బయ్య భార్య అపరాజిత ఈ కేసును హైకోర్టులో నడుపుతోంది. సీబీఐ విచారణకు సైతం కోరుతోంది. ఈహత్యకు సీఎం జగన్ నుంచి సజ్జల అవినాష్ వరకు పోలీసులపై ఒత్తిడి పెట్టినట్టు ప్రచారం వుంది. ఈ హత్యతో రాచమల్లు బంగారురెడ్డి దౌర్జన్యాలు పెరిగిపోయాయి.

### రోడ్‌షోలో చంద్రబాబు హామీల జల్లు



జగన్ సిద్ధం సభతరువాత మూడు రోజులకు మార్చి 30 నాడు చంద్రబాబు రోడ్ షో ప్రొద్దుటూరు శివాలయం నడిబొడ్డున మిట్టమధ్యాహ్నం మండుటెండలో సాగింది. పెద్ద ఎత్తున కార్యకర్తలు అబిమానులు చంద్రబాబు సభకు నియోజవర్గ వ్యాప్తంగా తరలివచ్చారు. ఈ సభలో చంద్రబాబు ప్రొద్దుటూరుకు మెడికల్ కాలేజిని మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కుందూ పెన్నా అనుసంధాన కాల్వ పూర్తి చేయిస్తానన్నారు. ప్రొద్దుటూరు కార్పొరేషన్ చేసి రాయలసీమలోనే గొప్ప వాణిజ్య నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రొద్దుటూరులో అక్రమంగా భూములు లాక్కున్న వారి నుంచి తిరిగి భూములను ఇప్పిస్తామని మామీ ఇచ్చారు. ఇంకా అనేక కార్యక్రమాలు చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రజల్లో జోష్ పెరిగింది. ప్రొద్దుటూరులో పెద్దాయన వస్తే అరాచక పాలన అంతం అవుతుందనే ప్రధానంగా ప్రొద్దుటూరు ఓటర్లు 80 ఏళ్ల పైబడిన రాజకీయ కురువృద్ధుడైన పెద్దాయన వరదరాజులరెడ్డి వైపు మొగ్గు చూపుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాకుండా పలు సర్వేల్లో రాచమల్లుకు వరదరాజుల రెడ్డికి గట్టిపోటీ వుందని ప్రకటిస్తూనే పెద్దాయనకే విజయం వరిస్తుందని చెబుతున్నాయి. ఈ ఎన్నికల్లో రాచమల్లు వందకోట్లకు పైగా డబ్బు ఖర్చు చేస్తున్న ఓటర్లకు డబ్బు తాయిలాలు ఎర చూపుతున్నా ఆయనకు ఈ సారి ఓటమి తప్పదని సర్వేలు చెబుతున్నాయి. ఏది ఏమైనా నేడు జరిగే పోలింగ్‌లో తమ ఓటుతో ప్రొద్దుటూరులో అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్నారు.

చివరికి ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌కు మున్సిపల్ చైర్మెన్ పదవి ఇస్తామని చెప్పి మున్సిపల్ ఎన్నికలకు రూ.11 కోట్లు ఖర్చు చేయించి ఆఖరికి చైర్మెన్ పదవి ఇవ్వకుండా కుట్ర చేశారు. రమేష్ యాదవ్ బీసీ చైర్మెన్ కుర్చీలో కూర్చుంటే తన బావమరిది బంగారురెడ్డికి తనకు మున్సిపాలిటీలో పెత్తనం తగ్గుతుందని భావించి రమేష్ యాదవ్‌ను తప్పించారు. మహిళను చైర్‌పర్సన్ చేసి మున్సిపాలిటీలో రెండో వైస్‌చైర్మెన్‌గా వున్న బంగారురెడ్డిని అనధికార చైర్మన్‌గా పరిపాలన సాగించేలా కుట్రలు చేశారు. దీంతో బీసీల విషయంలో రాచమల్లుది బానిసగా చూసే వైఖరి అని ప్రచారం జరిగింది. మున్సిపాలిటీలో మెజారిటీ వుండే వైసీపీ కౌన్సిలర్లు కూడా ఎలాంటి అధికారాలు లేకపోవడం విలువ లేకపోవడంతో అసమ్మతి వర్గాలు ఏర్పడి కొందరు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. మరికొందరు బయటికి వెళితే వారిని మళ్లీ బుజ్జగించి పార్టీలో పెట్టుకున్నారు. చివరికి ఎమ్మెల్యే రాచమల్లుకు అనుకూలంగా లేకుండా స్వతంత్రంగా వుండే వైసీపీ సర్పంచ్ శివచంద్రారెడ్డిని ముప్పుతిప్పలు పెట్టి వేధించాడు. దీంతో ఆయన పార్టీని వదిలి టీడీపీలో చేరారు. ఇప్పటికీ రాచమల్లు వెంట ఇష్టం లేకున్నా భయంతో కొందరు, ప్రలోభాలకు లొంగి మరికొందరు తిరుగుతున్నారు. ఈ పరిస్థితుల్లో టీడీపీ అభ్యర్థిగా వైసీపీ అభ్యర్థికి బలమైన పోటీదారుడు ఎవరని ఆలోచించి టీడీపీ అధినేత ఐదు పర్యాయాలు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచిన మేరునగధీరుడు, నిగర్వి అయిన నంద్యాల వరదరాజుల రెడ్డిని ఎంచుకున్నారు. దీంతో టిక్కెట్టు ఆశించిన వారిలో తీవ్ర అసంతృప్తులు ఏర్పాడ్డాయి. సురేష్ నాయుడు మాత్రం త్వరగా నిర్ణయం తీసుకుని వరదరాజుల రెడ్డికి మద్దతు పలికి ఆయన వర్గంలో వున్న వారందరినీ కలిసిపోయేలా చర్యలు తీసుకున్నారు తరువాత లింగారెడ్డి వరదరాజులరెడ్డికి మద్దతు పలికారు. ప్రవీణ్‌రెడ్డి మాత్రం పూర్తిగా ప్రచారాలకు దూరంగా వున్నారు.

### పెద్దాయన వైపే ఓటర్ల మొగ్గు

పదేళ్ల రాచమల్లు పాలన చూసిన ప్రొద్దుటూరు ప్రజలు ఈ సారి పెద్దాయన నంద్యాల వరద రాజులరెడ్డి వైపు మొగ్గు చూపుతున్నారు. 25 ఏళ్లలో పెద్దాయన ఎమ్మెల్యేగా 10 ఏళ్ల అధికార పార్టీ ఇన్‌చార్జిగా మొత్తం 35 ఏళ్ళ పెద్దాయన పాలనలో ఇసుక, భూదందాలు లేవని వివిధ వర్గాల వారు అభిప్రాయ పడుతున్నారు. క్రికెట్ బెట్టింగ్ మట్కా జూదం ఈ స్థాయిలో ఎప్పుడూ లేదని బుకీలను ప్రొద్దుటూరు నుంచి బహిష్కరణ చేసిన ఘనత వరద రాజులరెడ్డిదేనని ప్రజల్లో అభిప్రాయం నెలకొంది. ప్రొద్దుటూరులో 1985 నాటి ప్యాక్షన్ రోజులను తలపించేలా రోడ్లపై, టీ బంకుల వద్ద రాచమల్లు ఆయన బావమరిది బంగారురెడ్డి గురించి మాట్లాడుకోలేని భయం గుప్పిట్లో ప్రజలు బతికారు. వ్యాపారులు స్వేచ్ఛగా తమ వ్యాపారాలు సాగించలేని పరిస్థితి వచ్చిందని భావించారు. దీంతో రాచమల్లు లాంటి అంగ, ఆర్థిక బలం వున్న బలమైన వ్యక్తిని ఓడించాలంటే ఒక్క వరదరాజులరెడ్డి సరేన అభ్యర్థి అని అన్ని సర్వేల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఆయన నాయకత్వం కోరుకున్నారు. చంద్రబాబు ఎలాంటి షరతులు లేకుండానే పెద్దాయనకు టికెట్టు కేటాయించి పార్టీని గెలిపించాలని ఆదేశించారు. దీంతో దూర దూరంగా ఉంటున్న పలువురిని దగ్గరికి పిలిచి బుజ్జగించి పార్టీ ప్రతి ఒక్కరికీ సరైన న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. దీంతో దూరమైన, అసంతృప్త లను వరద దగ్గరికి చేర్చుకున్నారు.

### సిద్ధం సభలో ఏ హామీ ఇవ్వని జగన్



ప్రొద్దుటూరులో మార్చి 27న జరిగిన సిద్ధం సభలో వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ప్రొద్దుటూరు అభివృద్ధి పై ఒక్క మాట గానీ ఒక్క పథకం గానీ హామీ ఇవ్వలేదు. కేవలం రాష్ట్రంలో తాను అమలు చేస్తున్న నవరత్నాలు గురించి ఊదర గొట్టాడు దీంతో ఈ సారి కనీసం ప్రొద్దుటూరుకు ఏమి చేస్తా మో ఇప్పటి వరకు చేపట్టిన పథకాలు ఏమయ్యా యి, నిధులు ఎందుకు విడుదల కాలేదో సమాధానం లేదు. దీంతో ప్రొద్దుటూరు ప్రజలు తీవ్ర నిరా శ చెందారు. రాచమల్లు కూడా ఆ సభలో ప్రజలకు ఏ ఒక్క కొత్త హామీలను ప్రకటించలేకపోయారు. దీంతో ప్రొద్దుటూరు ఓటర్లను జగన్ ఆకట్టుకోలే పోయారని రాజకీయ విశ్లేషకులు బావిస్తున్నారు. జిల్లా స్థాయిలో పెట్టిన సభకు లక్షమందికిపైగా జనం వస్తారని అంచనావేసుకున్న కేవలం 30 వేలమంది మాత్రమే రావడంతో వైసీపీ కొంత ఆలోచనలో పడిందని పలువురు ఆ పార్టీనేతలే బయట చర్చల్లో బహిర్గతం చేశారు.

# సమర్థులకే ఓటు

తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్న యువత మనోగతం



కడప (ఎర్రముక్కపల్లె), మే 12: పాలకులు ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకువచ్చేలా ఉండాలి. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాట పట్టించాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. నాణ్యమైన విద్య వైద్యాన్ని ఉచితంగా ప్రజలకందించాలి. ఇవన్నీ చేయగల సమర్థత ఉన్న నేతలను ఎన్నుకోవాలి. అప్పుడే రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవితాల్లోనూ మార్పు సాధ్యమవుతుంది. మా ఓటు అటువంటి సమర్థుడైన నాయకుడికే అంటున్నారు తొలిసారి ఓటు వేసేందుకు సిద్ధమవుతున్న పట్టభద్రులు, యువకులు. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎందరో యువ ఓటర్లు కూడా ఇదే విధమైన అభిప్రాయంతో ఉన్నారు. రాష్ట్రాభివృద్ధికి దిక్సూచిగా వ్యవహరించే నేతను ఎన్నుకుంటే మేలు జరుగుతుందన్న భావన యువ ఓటర్లలో ఉంది. ఉచిత పథకాలకు ప్రాధాన్యతనివ్వకుండా ప్రజలు కష్టపడి సంపాదించుకునే మార్గాలను చూపించాలని వృత్తి, ఉపాధి కల్పన మార్గాలపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. ఇప్పటికీ నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందడంలేదని దీనిపై పాలకులు ఎందకు దృష్టి సాఇరించలేకపోతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్లలో రాష్ట్రాభివృద్ధికి ప్రణాళిక దానికనుగుణమైన కార్యాచరణ ముఖ్యమని ఆ దిశగా పాలకులు ముందు చూపుతో వ్యవహరించాలని యువ ఓటర్లు అభిప్రాయపడుతున్నారు. మరికొద్ది గంటల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తొలిసారి ఓటు వేయబోతున్న యువతీ యువకుల మనోగతాన్ని తెలుసుకునేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించింది, వారి అభిప్రాయాలు ఇలా..

### ఉపాధి కల్పించే వారికే ఓటు



దేశంలో నిరుద్యోగం పెరిగిపోయింది. ప్రభుత్వాలు వస్తున్నాయి పోతున్నాయి కానీ నిరుద్యోగసమస్యలు మాత్రం పట్టించుకోవడంలేదు. ఉద్యోగాలు దొరక్క ఈ విద్యా వ్యవస్థపై ప్రభుత్వాలు, పాలకులకు ముందు చూపులేకపోడం వల్లనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాలకులు ఎవరైనా ఉద్యోగాలు కల్పించేలా ఉండాలి. కొత్త పరిశ్రమలు తీసుకురావాలి. యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలి. అటువంటి ఆలోచన చేసే ప్రభుత్వాలకే ఓటు వేస్తాం. ఇప్పటికే ఆ దిశగా నిర్ణయం తీసుకున్నాం. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న ప్రతి ఒక్కరిదీ ఇదే మాట.

*గణేశ్, పెండ్లిమర్రి*

### ఉద్యోగావకాశాలు కల్పించినవారికే



ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తరువాత చదువుకునే యువతను నిర్లక్ష్యం చేస్తున్నారు. పాలకులకు ముందు చూపు లేకపోవడం వల్ల యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకఉండాపోతున్నాయి. అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వమైనా పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగావకాశాలు కల్పించాలి. కొన్ని గంటల్లో జరగబోయే ఎన్నికల్లో నా మొదటి ఓటు ఆలోచించి వేస్తా.

*గంగాధర్, ఐటీఐ, విద్యార్థి, పెండ్లిమర్రి*

### సంక్షేమం అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలి



నిజాయితీపరులైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలి. అప్పుడే అభివృద్ధికి అవకాశం ఉంటుంది. సంక్షేమం, అభివృద్ధిని సమానంగా తీసుకెళ్లేలా పాలకుల ఆలోచన ఉండాలి. అప్పుడే మెరుగైన సమాజాన్ని స్థాపించేందుకు అవకాశం ఉంటుంది. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక ప్రణాళికలను మేనిఫెస్టోలో పెట్టాలి. యువతకు మేలు చేసేవారిని ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. ఉచిత విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి. నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించే పాలకులను ఎన్నుకునేందుకు ఓటు హక్కు వినియోగించుకుంటాను.

*ఎ.సునీల్, డిగ్రీ ఫస్టియర్, ఎర్రగుంట్ల*

### అభివృద్ధికి ప్రాధాన్యతివ్వాలి



నిరుపేదలు ఉన్నత చదువులు చదివేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. పీజీ ప్రైవేటు కళాశాల్లో చేయడానికి ఫీజురీయింబర్స్‌మెంటు ఇవ్వడంలేదు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకు వచ్చే ప్రభుత్వానికి ఓటు వేస్తాను. నిరుపేదలకు ఉచితంగా ఉన్నత చదువులు చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వాలు కల్పించాలి. ఉచితాలకు కాకుండా అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రాధాన్యతనివ్వాలి. రాష్ట్రం ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకుని పథకాలు అమలు చేయాలి. అప్పు చేసి పథకాలు అమలు చేసే విధానానికి పాలకులు దూరంగా ఉండాలి. అటువంటి నేతలకు మాత్రమే ఓటు వేస్తాం.

*గణేశ్, డిగ్రీఫస్టియర్, కడప*

### అవినీతి రహిత పాలకులకే ఓటు



అవినీతిరహిత పాలన అందించే పాలకులను ఎన్నుకోవాలి. ఇప్పటికీ అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు ఇస్తేనే కానీ పనులు జరగడంలేదు. ఇటువంటి వ్యవస్థల్లో మార్పులు తీసుకురావాలి. ఆ దిశగా ప్రభుత్వాలు ఎందుకు కృషి చేయడంలేదు. అవినీతికి ఆస్కారం లేని ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. అటువంటి మంచి నాయకున్ని ఎన్నుకునేందుకు తొలి ఓటును వినియోగించుకుంటాను. బంధువులు చెప్పార నో కుటుంబ సభ్యులు వత్తిడి చేశారనో బలవంతంగా ఎవరికీ ఓటు వేయకూడదు. నా మనసుకు నచ్చిన వ్యక్తికి ఓటు వేస్తాను.

*పి.వేణు, బీఎస్సీ ఎంఎల్‌టీ సెకండియర్, కడప*

# టీడీపీలో నయాజోష్

వైసీపీలో అంతర్గత కుమ్ములాటలు / ఉత్సాహంలో టీడీపీ శ్రేణులు

కడప (ఎన్జీఆర్ సర్కిల్), మే 12: కమలాపురం నియోజకవర్గం టీడీపీలో నూతనోత్సాహం నింపుకొంది. నాలుగు దఫాలుగా ఓటమిని చవి చూసిన కమలాపురం నియోజకవర్గ టీడీపీ శ్రేణులు ఈ ఎన్నికల్లో నూతన ఉత్సాహంతో గెలుపు దిశగా కృషి చేస్తున్నారు. ప్రధానంగా టీడీపీ టికెట్ యువతకు కేటాయించడంతో పుత్తా నరసింహారెడ్డి తన కుమారుడిని టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి దింపారు. ఈ క్రమంలో ప్రచారం జరిగినన్ని రోజులు పుత్తా కుటుంబీకులు రోజూ జనాల్లోనే ఉంటూ టీడీపీ గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారు. గ్రామల్లో సైతం వారికి టీడీపీ శ్రేణులు, స్థానికులు కూడా ఘనంగా స్వాగతం పలికి ఆదరించారు. ఈ రోజు జరగబోయే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి గెలుపు కోసం సిద్ధమవుతున్నారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంతో విసిగిపోయిన ప్రజలు ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి నేటితో చరమగీతం పాడనున్నారు. వైసీపీలో అంతర్గత కుమ్ములాటలు చాపకింద నీరులా విస్తరించాయి. ఈ అంశం టీడీపీకి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులకు విజయావకాశాలను దక్కించేలా ఉన్నాయి. చాలా మండలాల్లో ఆధిపత్య పోరు ఆ పార్టీలో కొనసాగుతోంది. మండల కేంద్రమైన వల్లూరులో స్థానిక సర్పంచ్ కుటుంబీకులదే కొన్నేళ్లగా ఆధిపత్యం ఉండేది. అయితే ఈ ఎన్నికల్లో కేవలం కొన్ని గ్రామాలు మాత్రమే ఆ కుటుంబానికి అప్పగించారు. ఒకే పంచాయతీలోని మరిన్ని గ్రామాల్లో మరొకరికి అవకాశం ఇవ్వడంతో విబేధాలు తలెత్తుతున్నాయి. గడిచిన ఐదేళ్ల కాలంలో పలు సందర్భాల్లో కమలాపురం నియోజకవర్గం సమన్వయకర్త ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డికి, స్థానిక ఎమ్మెల్యేకు అంతర్గత విబేధాలు ఉండేవి. ఈ తరుణంలోనే నియోజకవర్గ స్థాయిలో వైసీపీ నేతలు కూడా వర్గాలు విడిపోయిన పరిస్థితులుండేవి. ఒకానొక సందర్భంలో చెరువుల్లో మట్టి తీసే అంశం, నదుల్లో ఇసుక తోడే అంశాలపై కూడా వీరికి కొంత వరకు విబేధాలు ఉండడంతో అదేపార్టీ వారు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడం కేసులు పెట్టుకునే స్థాయికి వెళ్లింది. టీడీపీ మరింత బలాన్ని సమకూర్చుకుంది. టిక్కెట్ యువతకు కేటాయించడంతో వారు ఉత్సాహంగా గెలుపుదిగా పనిచేస్తున్నారు.

# పులివెందుల వైసీపీలో నైరాశ్యం

● షర్మిల పోటీతో అంతర్మథనంలో వైసీపీ

● వైఎస్ విజయలక్ష్మి వీడియోతో మరింత కుంగిన వైసీపీ శ్రేణులు





తల్లితో వైఎస్ షర్మిల (ఫైల్ ఫొటో)

కడప, మే 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల వైసీపీ శ్రేణుల్లో రోజురోజుకూ నిరుత్సాహం, నైరాశ్యం పెరిగిపోతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గతంలో వచ్చిన మెజార్టీ తగ్గుతుందా అనే అనుమానం వైసీపీని వేధిస్తోంది. ఇందుకు టీడీపీ పక్కా వ్యూహంతో పావులు కదపడం ఒక ఎత్తయితే.. వివేకా హత్యే ప్రధాన అస్త్రంగా షర్మిల బరిలోకి దిగడం మరో కారణం. ఈ పర్యాయం తన ఉనికిని చాటుకోవాలని బీటెక్ రవి సర్వశక్తులు ఒడ్డి ప్రచారాన్ని సాగించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ ఓటర్లకు డబ్బు పంపిణీ సాగించింది. గతంలో టీడీపీ నేతలు అదో డబ్బు ఇస్తాం, ఇదో డబ్బులిస్తామని ఆశచూపి చివరకు వందో రెండు వందలో చేతిలో పెట్టి మిగిలిన డబ్బు జేబులో సర్దుకుని చేతులు దులుపుకొనేవారనే విమర్శలు ఉన్నాయి. కానీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈ పర్యాయం ఓటర్లకు ప్రతి చోటా సక్రమంగా డబ్బు పంపిణీ సాగించడంలో సఫలీకృతమయ్యారని తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం వస్తే పులివెందుల టీడీపీ నేతలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని బీటెక్ రవి నాయకులు, కార్యకర్తలకు భరోసా ఇస్తూ వచ్చారు. ఈ ప్రభావం జగన్ మెజారిటీపైన పడే అవకాశాలు స్పష్టంగా తెలుస్తోంది. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసిన అభ్యర్థులకు వచ్చిన ఓటింగ్ కంటే తనకు పైపెచ్చుగా రావాలనే లక్ష్యంతో టీడీపీ పావులు కదిపింది. ఈ కారణాలతో గతంలో వచ్చిన జగన్ మెజారిటీపై అనుమానాలు సన్నగిల్లుతున్నాయి.

### డోలాయమానంలో అవినాశ్‌రెడ్డి పరిస్థితి

షర్మిల కడప ఎంపీ బరిలో ఉండడంతో అవినాశ్‌రెడ్డి పరిస్థితి ఏమిటని ఆ వర్గ నాయకులు, వర్గాల్లో అంతర్మథనం మొదలైంది. పులివెందులలో గత ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ అవినాశ్‌కు రాకపోతే ఎంపీ స్థానం వదులుకోవాల్సిందేనని అక్కడి పార్టీ విశ్లేషకులు అంటున్నారు. వైఎస్ బిడ్డ షర్మిల బరిలో నిలవడంతో మునుపటి మెజారిటీ అవినాశ్ అందుకునే పరిస్థితి కనిపించడం లేదు. పులివెందుల సహా ఎంపీ సెగ్మెంట్ పరిధిలో పలు నియోజకవర్గాల్లో టీడీపీ బలంగా ఉండడం అవినాశ్‌రెడ్డి వర్గానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పులివెందులలో ఆదినుంచి వైఎస్ కుటుంబానికి, అవినాశ్ రెడ్డి కుటుంబానికి మధ్య దూరం ఉంటూ వచ్చింది. వైఎస్ ఉన్నన్ని రోజులు అవినాశ్ కుటుంబాన్ని దూరం పెడుతూ వచ్చారు. దీంతో ఆ నియోజకవర్గంలో కేవలం రాజశేఖరరెడ్డి, వివేకానందరెడ్డి కుటుంబాలపైనే ప్రజలకు అభిమానం ఉండేది. ఇపుడు వైఎస్ కూతురు షర్మిల, వివేకా కూతురు సునీత ప్రచారంలో దూసుకుపోయారు. వివేకా హత్యే ప్రధాన అస్త్రంగా వీరిద్దరూ ప్రచారాలు సాగించారు. రాత్రిళ్లు షర్మిల, సునీత ప్రసంగాలు కలలో కూడా వస్తున్నాయని వైసీపీలో చాలా మంది నేతలకు అంటుండడంతో అక్కడ పరిస్థితి ఎలాఉందో ఇట్టే అర్థమవుతోంది. కడప ఎంపీగా బరిలో నిలిచిన షర్మిల మీ వైఎస్ బిడ్డ, మీ రాజన్న బిడ్డ అని మైకు పట్టుకుని మాట్లాడుతుంటే.. కొంగు చాచి ఓటర్లను అభ్యర్థిస్తుంటే ఇక అవినాశ్ పని అయిపోయినట్లేనని ఆ వర్గ నాయకులే చర్చించుకుంటున్నట్లు తెలిసింది. చివరి అస్త్రంగా షర్మిల శిబిరం వైఎస్ సతీమణి వైఎస్ విజయలక్ష్మి వీడియోను విడుదల చేసింది. తన భర్త వైఎస్‌ను కడప పార్లమెంట్ పరిధిలో ఎలా అక్కున చేర్చుకున్నారో అదేవిధంగా తన బిడ్డ షర్మిలను అక్కున చేర్చుకుని ఆదరించాలంటూ వైఎస్ విజయలక్ష్మి పిలుపునివ్వడం అవినాశ్ శిబిరంలో దుమారం రేపుతోంది. దీంతో పులివెందుల నియోజకవర్గంలో తన ఓటింగ్ శాతం తగ్గితే ఇబ్బంది అవుతుందనే అవినాశ్‌రెడ్డి వర్గం ఓటుకు రెండువేలు ఇచ్చినప్పటికి మరోమారు రూ.1000, రూ.2000 పంపిణీ సాగించింది. ఇంటింటికీ వెళ్లి ప్రజలు వద్దంటున్నా గోడ గడియారాలు, చీరలు ఇచ్చారు. ఒకపక్క అవినాశ్‌రెడ్డి గెలుపునకు ఢోకా లేదు అంటూనే మరోపక్క ఏమవుతుందోననే ఆందోళన వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

# టీడీపీలో జోష్

వైసీపీలో నైరాశ్యం ? ● షర్మిలకు క్రాస్ ఓటింగ్ ? ● నేడు పోలింగ్



టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధాకర్ యాదవ్

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామిరెడ్డి

మైదుకూరు, మే 12: కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సోమవారం జరగనున్న పోలింగ్‌లో టీడీపీ జోష్ కనబడుతుండగా అధికార పార్టీ వైసీపీలో కాస్తంత నైరాశ్యం కనబడుతున్నట్లు రాజకీయ వర్గాల విశ్లేషణ. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచీ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ ఉత్సాహంగా నియోజకవర్గం మొత్తం కలియతిరుగుతూ అధికార పార్టీలోని వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్, సర్పంచ్, ఏకంగా మాజీ జడ్పీటీసీ సహా పార్టీలో కీలక పదవులున్న నేతలను సైతం టీడీపీ వైపు మొగ్గు చూపేలా చేసి వేలాదిమంది కుటుంబాలకు టీడీపీలోకి ఆహ్వానం పలికారు. ఓ వైపు వైసీపీ నేతల చేరికలు మరో వైపు టీడీపీ ప్రకటించిన మ్యానిఫెస్టోలోని అంశాలపై ఇంటింటికీ తిరుగుతూ చేసిన ప్రచారంలో ఉత్సాహం పెంపొందించారు. నియోజకవర్గంలో ఎక్కడ రోడ్‌షో పెట్టినా వేలాది మంది కార్యకర్తలు పాల్గొంటూ ఉండడంతో, ప్రచారానికి అధినాయకులు రాకపోయిన టీడీపీ జోష్ కనబడుతోంది. కాగా అధికార పార్టీ వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిపై వ్యతిరేకత కనపడుతోంది. వైసీపీలో ఉన్న దాదాపు నాయకులందరూ టీడీపీలో చేరడం, నియోజకవర్గంలో కేవలం ప్రభుత్వ పథకాలు తప్పితే ఆయన చెప్పుకోదగ్గ ఎటువంటి అభివృద్ధి పనులూ కనబడక పోవడంతో పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం కనబడుతోందని సమాచారం. దీంతో ముఖ్యమంత్రి హోదాలో జగన్ మోహన్‌రెడ్డి బస్సు యాత్ర సభ మైదుకూరులో పెట్టి, ప్రభుత్వ పథకాలు మాత్రమే వివరించి ముగింపు పలుకబోయారు. దీంతో ఎంపీ అవినాష్‌రెడ్డి ఓ కాగితం ముక్కను సీఎం జగన్ చేతికి ఇవ్వగా దాన్ని చూసి, అప్పుడు ఇచ్చిన హామీ రాజోలి రిజర్వాయర్ నిర్మించలేక పోయానని, మళ్ళీ ఈ దఫా ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే నిర్మాణం చేపడతానంటూ మళ్లీ ఉత్తుత్తి హామీని ఇచ్చి వెళ్లినా ఆయన మాటలను నియోజకవర్గ ప్రజలు నమ్ముతారన్నా గ్యారెంటీ కనపడటం లేదు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల సహా వివేకా కుతురు డాక్టర్ సునీత మైదుకూరుకు రెండు సార్లు పర్యటించి, జగన్ దుర్మార్గపు చర్యలు, మోసాలు, దోపిడీలు ప్రజలకు వివరించారు. ఆయనకు ఓట్లేస్తే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీ వివేకానందరెడ్డి ఆత్మ ఘోషిస్తుదంటూ ఓటర్లకు వివరించారు. దీంతో ఓటర్లు డైలమాలో పడి టీడీపీ వైపే మొగ్గు చూపుతూ క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఏదీ ఏమైనా నియోజకవర్గంలో టీడీపీలో జోష్‌లో కనబడుతుండగా, అధికార పార్టీ వైసీపీలో నైరాశ్యం కనబడుతోందని ఓటర్లు బహిరంగాంగానే చర్చించుకుంటున్నారు.

# నిలువ నీడేది జగన్ ?

● షెల్టర్లు ఎప్పుడు కడతారో కాలజ్ఞానికే ఎరుక

మైదుకూరు, మే12: ప్రపంచంలో ఏదీ ఎప్పుడు ఎక్కడ ఎలా జరుగుందో తెలియజేసిన కాలజ్ఞానవేత్త పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి. ఆ పవిత్ర పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారి మఠంలో ప్రయాణికులు కనీసం నిలబడేందుకు కూడా బస్సు షెల్టర్ లేదు. చారిత్రక, దర్శనీయ స్థలంగా పేరుపొందిన బ్రహ్మంగారిమఠంకు రెండు తెలుగు రాష్ట్రాలు కర్నాటక, తమిళనాడు కాకుండా ఇతర దేశాల నుంచి అనేక మంది భక్తులు వస్తుపోతుంటారు. బ్రహ్మంగారు కులాలను రూపుమాపి సమసమాజ నిర్మాణానికి కృషి చేసిన ఈ క్షేత్రంలో ప్రయాణికులు, భక్తులు బస్సుల కోసం వీధుల్లో నిలబడాల్సివస్తోంది. ఆర్టీసీ బస్టాండ్ నిర్మిస్తామని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పదేళ్లగా చెబుతూ సీఎం జగన్ దృష్టికి తీసుకుపోయినట్లు బహిరంగంగా చెప్పినా ఇంత వరకు కనీసం ఆ దశగా అమలుకు నోచుకోలేదు. ఎండవాన పగలు రాత్రి అనక భక్తులు, ప్రయణికులు నడిరోడ్డుపైనే బస్సుల కోసం ఎదురుచూస్తుండిపోతున్నారు. బ్రహ్మంగారిమఠం ఆలయానికి ఏటా జరిగే ఆరాధన ఉత్సవాల్లో కనీసం 3 లక్షల మంది భక్తులు పాల్గొంటారు. ఆలయానికి భక్తుల నుంచి హుండీ ద్వారా వచ్చే ఆదాయం ఏడాడికి దాదాపు 4నుంచి 5 కోట్ల వరకు వస్తున్నా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలోనూ విఫలమవుతున్నారు. భక్తులు నిలబడేందుకు కనీసం షల్టర్ కూడాలేక పోవడం గమనార్హం. మఠం కూడలిలో అతి పురాతంగా ఓ షెల్టర్ ఉండేది. బ్రహ్మంగారిమఠం అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మూడేళ్ల క్రితం ఎమ్మెల్యే స్థానిక నేతలతో కలసి షల్టర్‌ను కూల్చేశారు. తదుపరి చర్యల నిమిత్తం ఆ ప్రాంతంలో ప్రయాణికులు నిలబడేందుకు కనీసం నీడనిచ్చే ఇనుప రేకులు కూడా వెయ్యలేదు. దీంతో భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

# పోలింగ్‌కు సర్వం సిద్ధం



ప్రొద్దుటూరులో పీవోలు, ఏపీవోలకు డ్యూటీలు వేస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు , మే 12 : సార్వత్రిక ఎన్నికల సమరానికి సర్వం సన్నద్ధమైంది. మరి కొన్ని గంటల్లో పోలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సిబ్బందికి ఈవీఎంలు, వీవీప్యాడ్‌లు , పోలింగ్ సామగ్రిని పంపిణీ చేసే కార్యక్రమాన్ని స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. ఆర్వో కౌసర్‌భాను ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు ఎన్నికల సామగ్రిని అందజేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో స్వేచ్ఛగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. శాంతి భద్రతలు కాపాడటానికి స్థానిక పోలీసులతో పాటు పారామిలటరీ బలగాలు కూడా వచ్చాయన్నారు. ఈ ఎన్నికలలో ప్రొద్దుటూరులో మొత్తం 2.47, 966 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లుతెలిపారు. వీరిలో . వీరిలో 1,19,985 మంది పురుషులు, 1,27,933 మంది స్త్రీలు ,48 మంది ఇతరులు ఉన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మొత్తం 268 పోలింగ్ కేంద్రాలు వున్నాయన్నారు. వీటిలో 141 ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోవుండగా 94 కేంద్రాలు రూరల్ పరిధిలో వున్నాయి. రాజుపాళెం మండలంలో 33 కేంద్రాలున్నాయన్నారు. మరో రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 81 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. ఈ కేంద్రాలకు ఈవీఎంలు, వీవీప్యాడ్‌లను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు 17 ఆర్‌టీసీ బస్సులు , 42 మినీ స్కూలు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియలో 268 పీవోలు, ఏపీవోలు, 1069 మంది ఇతర సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. మొత్తం 15 మంది అభ్యర్థులు పోటీలో వుండగా ప్రధాన పోటీ టీడీపీ, వైసీపీ అభ్యర్థుల నడుమ సాగనుంది.

**మైదుకూరు..:** మే 12 : కేంద్ర బలగాలతో భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య సోమవారం పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు తగిన ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 2,11,855 మంది ఓటర్లు 269 కేంద్రాలలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ కెమరాలు ఏర్పాటు చేయడంతో పాటు 29 సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఫుణుల పర్యవేక్షణలో ఈ ఎన్నికలు నిర్వహించేందుకు రిటర్నింగ్ అధికారి చంద్రమోహన్, డీఎస్పీ వెంకటేశ్ అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఎన్నికల్లో 2506 మంది సిబ్బంది పాల్గొననున్నారు. కాగా పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ 100 మీటర్లు గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. మైదుకూరు నియోజకవర్గంలో మొత్తం 2,11,855 ఓట్లు ఉన్నట్లు అధికారులు ఖరారు చేశారు.

**పోరుమామిళ్ల..:** మండలంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను సంబంధిత అధికారులు సిద్ధం చేశారు. పోరుమామిళ్ల మండలంలో దాదాపు 59 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఆరు గురు సిబ్బంది చొప్పున ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం బస్సుల్లో వారికి కేటాయించిన ప్రాంతాల్లో వారిని వదిలి వేశారు. పోరుమామిళ్లలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద షామియానాలు ఏర్పాటు చేసి వారికి ఓటర్లు తమ ఓటును వినియోగించుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

**కొండాపురం..:** మండలంలో నేడు జరిగే సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు కొండాపురం తహసీల్దార్ సి.శ్రీనివాసులు తెలిపారు.మండలంలో ఉదయం 7 గంటల నుంచి సాయింత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మండలంలో మొత్తం 44 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు.అందులో 18 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కాగా మండలంలో 34,866 మంది ఓటర్లు ఉన్నారు.

**మైలవరం..:** పోలింగ్‌కు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మైలవరం మండలంలో మొత్తం ఓటర్లు 32,631 మంది ఉండగా వారిలో మహిళలు 16608 మంది, పురుషులు 16021 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారని డిప్యూటి తహసీల్దారు రూపేష్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తును పర్యవేక్షించనున్నారు.

**బ్రహ్మంగారిమఠం..:** సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. మండలంలో మొత్తం 42 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద సమస్యలు వస్తే బీఎల్‌వో, స్థానిక పోలీసువారికి వెంటనే ఫిర్యాదు చేయాలని తెలిపారు.

**చాపాడు..:** ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం 313 మంది ఉద్యోగులను విధుల్లో నియమించినట్లు అధికారులు తెలిపారు. మండలంలో మొత్తం 39 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 39 మంది పోలింగ్ అధికారులు, 39 మంది అదనపు పోలింగ్ అధికారులను నియమించారు. కిందిస్థాయి సిబ్బంది 156 మందిని నియమించారు. స్పెషల్ బెటాలియన్ పోలీసులు 40 మందిని, స్థానిక పోలీసులను 39 మందిని నియమించారు. ఖాదర్‌పల్లె, చియ్యపాడు గ్రామాల్లో ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**జమ్మలమడుగు..:** జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి పోలింగ్ సిబ్బంది ఈవీఎంలను, పోలింగ్ సామగ్రిని ఆదివారం మధ్యాహ్నం తీసుకెళ్లారు. ఉదయం 7 గంటల నుంచి రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు, వారి సిబ్బంది డీఎస్పీ యశ్వంత్, ఎన్నికల సిబ్బంది హాజరు విషయంలో మాట్లాడుతూ పరిశీలించారు. అనంతరం ఈవీఎంలకు సంబంధించిన తదితర విషయాలపై రిటర్నింగ్ అధికారి సూచనలు, సలహాలు ఇచ్చారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి జరిగే పోలింగ్ పక్రియకు సర్వం సిద్ధం చేసినట్లు వారు తెలిపారు. అదే విధంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు విషయంలో మొబైల్ పోలీస్ టీం, అధికారులు, సిబ్బంది తనిఖీలు చేశారు. జమ్మలమడుగు మండలంలోని మోరగుడి, ఎస్.ఉప్పలపాడు, తదితర గ్రామాల్లో ఎస్‌ఐ కల్పన సిబ్బంది తనిఖీలు చేశారు. కాగా 315 పోలింగ్ కేంద్రాల్లో 2,500 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు కడప కమిషనర్ ప్రవీణ్‌చంద్, రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఉదయం జమ్మలమడుగులోని బాలికల జూనియర్ కళాశాల ఆవరణంలో ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక సూచనలు ఇచ్చారు.

**ఎర్రగుంట్ల..:** ఎన్నికలకు సర్వం సిద్ధం అయ్యాయి. పోలింగ్ బూత్‌లకు ఈవీఎం మిషన్లు, ప్రభుత్వ సిబ్బంది ఆదివారం సాయంత్రానికి చేరుకున్నారు. ఎర్రగుంట్లనగరపంచాయతీ, ఎర్రగుంట్ల రూరల్ పరిధిలో మొత్తం 79 పోలింగ్ బూత్‌లున్నాయి. మొత్తం 59,857మంది ఓటర్లున్నారు. ఇందులో మహిళలు 30,651, పురుషులు 29,204మంది, ఇద్దరు ట్రాన్స్ జెండర్స్ ఉన్నారు. 27 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. కాగా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదివారం ఎర్రగుంట్ల మండలంలోని చిర్రాజుపల్లె, రంగసాయిపురం, పెద్దనపాడు తదితర గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఎవరినీ ఉపేక్షించవద్దని ఎన్నికల నిబంధనలను తూ.చా తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు.

**ముద్దనూరు..:** మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం ఏర్పాట్లు చేశారు. ముద్దనూరు లోని బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లుకు క్యూలైన్ కోసం బారికేట్లు, చలువ పందిర్లు వేశారు.38 పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ నిర్వహిస్తున్నారు.

**ఖాజీపేట..:** నేడు జరుగనున్న ఎన్నికల సందర్భంగా మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. మండల పరిధిలో 54 పోలింగ్ కేంద్రాలు ఉండగా అన్ని కేంద్రాల వద్ద పందిర్లు, నీరు, క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ రామాంజులు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. మండల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఓటు వేశామా, ఇంటికి వెళ్లామా అన్న చందంగా ఓటర్లు వెళ్లిపోవాలని, ఘర్షనలకు పాల్పడితే జైలుపాలు కాకతప్పదని సీఐ పేర్కొన్నారు.



మైదుకూరులో ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది



ఎర్రగుంట్లలో ఏజెంట్లకు గుర్తింపు కార్డులు ఇస్తున్న అధికారులు



జమ్మలమడుగులో ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న అధికారులు



జమ్మలమడుగులో ఎన్నికల సామగ్రిని మోసుకెళుతున్న పోలింగ్ సిబ్బంది

## ఎమ్మెల్యే అవినీతి అంతా ఇంత కాదు: డీఎల్



మైదుకూరు, మే 12 : ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేసిన అవినీతి అంతా ఇంతా కాదని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి ఆరోపించారు. కాగా ఆయన చేసిన అవినీతిపై ఉద్యమం చేస్తామనుకునే లోపే ఈ ఎన్నికలు వచ్చాయని ఆ అవినీతిపై పోరాడేందుకే టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్‌కు ఓట్లేయమని అడుగుతున్నానంటూ డీఎల్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. ఖాజీపేటలోని ఆయన నివాసంలో ఆదివారం మాట్లాడారు. తనకు 78 సంవత్సరాలు ఈ ఎన్నికల్లో అవకాశమిస్తే మరో ఐదేళ్లు సేవ చేసుకుంటా, నా పాలనలో అవినీతి లేదంటూ ఓటర్లను మభ్యపెట్టేందుకు రఘురామిరెడ్డి వీడియో విడుదల చేశారని డీఎల్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఆయన చాలా అవినీతికి పాల్పడ్డారన్నారు. మైదుకూరులో ఉన్న సంతను ఎవరికీ అందుబాటులో లేకుండా శివారులో ఏర్పాటు చేశారన్నారు. మైదుకూరులోని గగ్గితిప్ప, నాగసానిపల్లె వద్ద గ్రావెల్ వ్యవహారంపై నియోజకవర్గంలో ఏ వ్యక్తిని అడిగినా చెబుతారన్నారు.ఈయన అవినీతిపై ఉద్యమం చేస్తామనుకున్నానని అంతలోనే ఎన్నికలు వచ్చాయని డీఎల్ పేర్కొన్నారు. ఆయన అవినీతిపై పోరాడేందుకే టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్‌కు మద్దతు ఇస్తున్నానన్నారు.

## ఎన్నికల వేళ బస్సుల కోత

ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు, ఉద్యోగులు



ఆర్టీసీ బస్టాండులోబస్సు కోసం వేచి ఉన్న ఉద్యోగులు, ప్రయాణికులు

పోరుమామిళ్ల, మే 12 : ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు ఎన్నికల విధులకు వాడుకోవడంతో డిపోల్లో బస్సుల కొరత ఏర్పడింది. దీంతో ఎన్నికల విధులకు వెళ్లే ఉద్యోగులు, దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం జరగనున్న ఎన్నికలకు సంబంధించి దూర ప్రాంతాలకు ఎన్నికల విధులకు వెళ్లే ఉద్యోగులు తెల్లవారుజామున 4 గంటల నుంచి ఆర్టీసీబస్టాండులో బస్సుల కోసం పడిగాపులు కాశారు. తెల్లవారేవరకు బస్సులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజంపేట, కడప దూర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులు ఉన్న తిరుపతి బస్సు ఒక్కటి ఫుల్ కావడంతో జీపులు, ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం ఆర్టీసీబస్టాండులో మహిళా ఉద్యోగులు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఒక్కసారిగా ఆటోలు, జీపులకు పూర్తి గిరాకీ ఏర్పడింది .ప్రయాణికుల అవసరాన్ని బట్టి బాడుగలు కూడా విపరీతంగా పెంచారు. దూర ప్రాంతాల నుంచి ఓటు వేసేందుకు వచ్చిన వారు తమ గ్రామాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్టాండు ఆవరణంలో ఒక్క బస్సు వస్తే చాలు. వంద మందికి పైగా ప్రయాణికులు బస్సును చుట్టుకోవడం కనిపించింది. బస్సుల్లో నిల్చునే స్థలం లేకున్నా ఎలాగోలా తాము అనుకున్న ప్రాంతాలకు వెళ్లాలని తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, మహిళల పరిస్థితి వర్ణణాతీతం.



ఆర్టీసీ బస్టాండులో బస్సుల్లో సీట్ల కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

## సృష్టికి జీవం అమ్మ

కమలాపురం రూరల్, మే 12 :సృష్టికి జీవం అమ్మ అని.. అమ్మ లేనిదే సృష్టి లేదని.. గ్రేటర్ వాసవీ క్లబ్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు. ఆదివారం స్థానిక అమ్మవారిశాలలో మదర్స్‌డే సందర్భంగా అమ్మలను సన్మానించారు. పిల్లలు వారి తల్లుల కాళ్లు కడిగి తమ ప్రేమను చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేరులో ప్రేమని, పిలుపులో మాధుర్యాన్ని నింపుకున్న అమృతమూర్తి అమ్మ అన్నారు. అమ్మ ప్రేమ అంత తీయనైంది కనుకనే ఆ భగవంతుడు తనకు కూడా అమ్మ కావాలనుకున్నాడు. ఈలోకాన్ని సృష్టించిన ఆ దేవాదిదేవుడు కూడా మానవ రూపం ధరించి అమ్మ కడుపునే పుట్టాడన్నారు. అంత గొప్పది అమ్మ, అని అమ్మ ప్రేమ గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు.



అమ్మలపాదాలు కడుగుతున్న చిన్నారులు

## ఉచితంగా పిల్లలకు ఖత్నా

జమ్మలమడుగు, మే 12: జమ్మలమడుగు పట్టణంలోని గౌషియా షాదీఖానాలో ఆదివారం ఉదయం కార్వానే అహలే బైత్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద ముస్లిం పిల్లలకు ఉచిత వడుగులు (ఖత్నా) నిర్వహించారు. ఆస్తానయే గౌషియా పీఠాధిపతి సయ్యద్ గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద ఆస్తానములవారి ఉరుసు కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బయటి గ్రామాల నుంచి వచ్చిన వారికి ఖత్నా చేయించుకున్న వారికి రూ.100 బస్‌ఛార్జీలతోపాటు 5 కేజీలు గోధుమ పిండి, చక్కెర, బెల్లం, నెయ్యి సంబంధించిన కిట్‌ను పిల్లల తల్లిదండ్రులకు పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రీ అందించారు. ఈ కార్యక్రమంలో గౌషియా షాదీఖానా, గౌషియా మకాన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక గ్రామాల సందర్శన

- జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్



ఎన్నికల గురించి మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

ప్రొద్దుటూరు క్రైం, మే 12 : ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని సమస్యాత్మక గ్రామాలను ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సందర్శించారు. ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఆదివారం ఆయన పోలీసు అధికారులు, గ్రామస్తులతో మాట్లాడారు. ప్రొద్దుటూరు అసెంబ్లీ నియెజకవర్గం పరిధిలో సమస్మాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. పక్కవారి ప్రలోభాలు, బెదిరింపులకు భయపడదద్దని, పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ప్రలోభాలు, బెదిరింపులు ఎవరైనా చేసినట్లయితే పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళీధర్, రూరల్ సీఐ మరణారెడ్డి, రూరల్ ఎస్‌ఐలు శివప్రసాద్, చిరంజీవి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణ సుందరీకరణ అంటే ఇదేనా..?

- కాలువల పక్కన దెబ్బతిన్న రోడ్లు
- పడిపోయిన కాలువలు - నిండిన డ్రైనేజీ
- రోడ్డుపై చేరిన మురుగునీరు
- విమర్శలు చేస్తున్న జమ్మలమడుగు పట్టణ ప్రజలు

జమ్మలమడుగు, మే 12 : జమ్మలమడుగు మున్సిపాలిటీ వివిధ సమస్యలతో అభివృద్ధిలేక కొట్టుమిట్టాడుతోంది. అయిదు సంవత్సరాలు వైసీపీ పాలనలో ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు పట్టణంలో ఏం చేశారని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ప్రధానంగా నారాపురం వేంకటేశ్వరస్వామి దేవాలయం ఎదురుగా రోడ్డు గుంతలు, అలాగే సాయిరాం థియేటర్ ఎదురుగా డ్రైనేజీ కాలువలు, రాళ్లు పడిపోయాయి. ఎత్తపువారి కాలనీకి వెళ్లే దారిలో కోర్టుకు ఎదురుగా డ్రైనేజీ కాలువలో వ్యర్థాలు నిండుకున్నాయి. అక్కడి నుంచి చైర్‌పర్సన్ శివమ్మ నివాసం ఉండే వీధిలో సిమెంటు రోడ్లు లేక ఉన్నచోట కాలువలు లేక రోడ్డుపై వర్షపునీరు నిలిచి వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నేతాజీనగర్‌లో, ఎత్తపువారి కాలనీలో డ్రైనేజీ సమస్యలు ఉన్నాయి. కొన్ని చోట్ల రోడ్డు కాలువ కంటే తగ్గు భాగంలో ఉండడం వలన డ్రైనేజీ నీరు రోడ్డుపై చేరుతోందని స్థానికులు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదురుగా డ్రైనేజీ కాలువలో మట్టి, వ్యర్థాలు నిండాయి. పాత బస్టాండులోని టౌన్ చర్చి సమీపం నుంచి రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ దుర్వాసన ముక్కు పుటాలు అదరగొట్టుతున్నాయి. పట్టణంలోని మార్కెట్‌రోడ్డు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అలాగే మెయిన్‌బజార్, కాపు వీధి తదితర వీధుల్లో జమ్మలమడుగు మున్సిపాలిటీకి ప్రధాన సమస్య డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎత్తపువారి కాలనీలో బీరువాలు తయారు చేసే ప్రాంతం నుంచి చుట్టుపక్కల దాదాపు 10 నుంచి 15 ఇళ్లకు మోటార్లు వేసినా మంచినీరు ఎక్కడంలేదని వాపోయారు. ఏడాది క్రితం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమస్య తెలిపినా పరిష్కారం కాలేదని స్థానికులు వాపోతున్నారు. పందుల బెడద అధికంగా ఉన్నప్పటికి చర్యలు లేవని ప్రజలు వాపోయారు. మంచినీటి సమస్యకు సంబంధించిన విషయంలో మున్సిపల్ డీఈ బాలమల్లేశ్వర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా మంచినీటి సమస్య అయితే ఎత్తపువారి కాలనీలోని కొందరికి ఉందని, మోటార్లు వేసినా నీరు ఎక్కడంలేదని తమ దృష్టికి సమస్య వచ్చిందని తెలిపారు. ఇలాంటి సమస్యలు జమ్మలమడుగు పట్టణంలో అధికంగా ఉన్నాయి. సిమెంటు రోడ్లు వేస్తామని, ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రం చేసే నాథుడే లేరని స్థానికులు వాపోతున్నారు. వీధి దీపాలు కూడా సక్రమంగా వెలుగడంలేదని, కొన్ని చోట్ల ప్రభుత్వ కార్యాలయాల ముందే అంధకారంగా మారినా అధికారుల్లో స్పంద లేకపోవడం దారుణమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదురుగా కాలువలో నిండిన మట్టి





సిమెంటు రోడ్డు లేని దృశ్యం, రోడ్డుపై చేరిన మురుగునీరు